- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శుక్రవారం
03-04-2026

సంపుటి : 01 సంచిక :12 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.


Mr. NAKKA RAJU
Chairman of Namastey Mahaaprabha

Published From RANGAREDDY తెలంగాణ. RNI NO : TGTEL/26/A0738 VOLUME : 01 ISSUE :12 NAMASTEY MAHAAPRABHA

## కాళేశ్వర జలాలు చూపిస్తం..
# వచ్చే దమ్ముందా!

### కిషన్‌రెడ్డి వ్యాఖ్యలకు హరీశ్‌రావు కౌంటర్

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్
- మీ వ్యాఖ్యలే కాంగ్రెస్, బీజేపీ పొత్తుకు సాక్ష్యం
- ఆర్థిక సర్వే రిపోర్టు మీ కండ్లకు కనిపించదా?
- గడ్కరీ,సీడబ్ల్యూసీ చైర్మన్ ప్రశంసలు అబద్ధమా?
- ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపి తెలంగాణకు ద్రోహం చేసింది బీజేపీయే



హైదరాబాద్, ఏప్రిల్ 2( మహాప్రభ

: కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్, బీజేపీ మధ్య చీకటి పొత్తుకు సాక్ష్యమని బీఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్‌రెడ్డి కొనసాగిం చారని దుయ్యబట్టారు. 'ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరాన్ని నిర్మించడం అబద్ధమా? 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా? ఈ రోజు, ఈ నిమిషానికి మండుటెం డల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాలువల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధ మా? ఏది అబద్ధం కిషన్‌రెడ్డీ? పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం. మరి వచ్చేందుకు మీకు దమ్ముందా?' అని హరీశ్‌రావు సవాల్ విసిరారు. 'మీరు క్యాబినెట్ మంత్రిగా ఉన్నారుఏ ప్రభుత్వమైనా ప్రజాధనం తోనే నిర్మాణాలు చేస్తుందన్న విషయం

-మిగతా 3 లో



## సన్‌రైజర్స్
# పవర్ పంచ్

- 65 రన్స్ తేడాతో కోల్‌కతాపై విజయం
- నితీశ్ ఆల్‌రౌండ్‌షో
- చెలరేగిన క్లాసెన్, అభిషేక్, హెడ్
- ఉనాద్కట్‌కు మూడు వికెట్లు


కోల్‌కతా ఏప్రిల్ 2( మహాప్రభ

ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 65 పరుగుల తేడాతో ఘన విజయం సాధిం చింది. తొలుత ఓపెనర్లు అభిషేక్ శర్మ(48; 21బంతుల్లో 4ఫోర్లు, 4సిక్సర్లు), హెడ్(46; 21బంతుల్లో 6ఫోర్లు, 3సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌కి తోడు క్లాసెన్(52) అర్ధసెంచరీతో రాణించడంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 226 పరుగుల

-మిగతా 3 లో

## గాజాలో శైశవయాత్ర!

3





## 53 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర

- 53 సంవత్సరాల తర్వాత మళ్లీ చంద్రుడి చెంతకు!
- అమెరికన్ల జాబిల్లి యాత్ర ప్రారంభం
- నాసా ఆర్టెమిస్-2 విజయవంతం
- చంద్రుడి వద్దకు ఓరియన్ రాకెట్

న్యూయార్క్ ఏప్రిల్ 2( మహాప్రభ

అంతరిక్ష పరిశోధనల్లో మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. 53 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ మానవుడు మళ్లీ చంద్రుడి వద్దకు పయనమయ్యాడు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రమండల యాత్ర 'ఆర్టెమిస్-2' దిగ్విజయంగా ప్రారంభమైంది. గురువారం తెల్లవారుజామున 4.06 నిమిషాలకు ఈ ప్రయోగం మొదలైంది. ఈ ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి సమీపానికి వెళ్లి పరిశోధనలు చేయనున్నారు. నలుగురు

-మిగతా 3 లో



## నిర్భయంగా
# ఓటేయండి..

- టీఎంసీని బంగాళాఖాతంలో కలపండి..
- బెంగాల్ ప్రజలకు అమిత్ షా పిలుపు

న్యూఢిల్లీ ఏప్రిల్ 2( మహాప్రభ

పశ్చిమ బెంగాల్ ప్రజలందరూ నిర్భయంగా ఓటేయాలని, అధికార టీఎంసీని బంగాళాఖాతంలో కలపాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజధాని కోల్‌కతాలో బీజేపీ గురువారం నిర్వహించిన ర్యాలీలో షా ప్రసంగించారు. ఈ సందర్భంగా అధికార టీఎంసీపై, సీఎం మమతా బెనర్జీపై కీలక వ్యాఖ్యలు చేశారు. టీఎంసీ గూండాలకు ఈసారి ఓటర్లు ఎవరూ

-మిగతా 3 లో

# భారత్‌కు ఇజ్రాయిల్ లైట్ మెషిన్ గన్స్


- అదానీ గ్రూప్, ఐడబ్ల్యూఐల సంయుక్త సంస్థల మధ్య డీల్ కోసమే మోడీ టూర్ ?
- 'మేక్ ఇన్ ఇండియా' పేరిట సాంకేతికత బదిలీ
- 41వేల తుపాకులకు కుదిరిన భారీ ఒప్పందం

న్యూఢిల్లీ ఏప్రిల్ 2( మహాప్రభ

భారత్- ఇజ్రాయిల్ రక్షణ ఒప్పందాలు సజావుగా సాగుతున్నాయి. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా ఇజ్రాయిల్‌కు చెందిన ఒక ప్రముఖ ఆయుధాల తయారీ సంస్థ తేలికపాటి మెషిన్ గన్ (ఎల్‌ఎంజీ )లను భారత్‌కు సరఫరా చేసింది. భారత్, ఇజ్రాయిల్ మధ్య 41వేల తుపాకులకు సంబంధించి భారీ ఒప్పందం కుదిరింది. అయితే తొలివిడతలో భాగంగా గత వారాంతంలో 2వేల

-మిగతా 3 లో






## అమరావతికి
# ఆమోదముద్ర

- రాజ్యసభలోనూ ఏకగ్రీవం
- బిల్లును రాష్ట్రపతికి పంపనున్న కేంద్రం
- రాష్ట్రపతి సంతకంతో గెజిట్ విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2( మహాప్రభ

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ అమరావతి బిల్లుకు ఉభయ సభలు ఏకగ్రీవ ఆమోదం తెలిపాయి. అనంతరం ఈ బిల్లును కేంద్రం.. రాష్ట్రపతికి పంపనుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేసిన తర్వాత గెజిట్ నోటిఫికేషన్ విడుదలకానుంది. దీంతో ఏపీ ఏకైక రాజధానిగా అమరావతి అమల్లోకి రానుంది. ఈ బిల్లు రాజ్యసభలో గురువారం ఆమోదం పొందడంతో..

-మిగతా 3 లో



## ఢిల్లీలో దోస్తీ..
# రాష్ట్రంలో కుస్తీ!..

- ఇండియా కూటమి పార్టీల తీరు
- లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ
- అసెంబ్లీ ఎన్నికల్లో ముఖాముఖీ ఢీ

న్యూఢిల్లీ ఏప్రిల్ 2( మహాప్రభ

కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న ధ్యేయంతో ఏర్పడిన ఇండియా కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్టు వ్యవహరిస్తున్నది. ఢిల్లీ నుంచి మహారాష్ట్ర ఎన్నికల వరకు ఇదే తీరు. పిల్లీ పిల్లీ కొట్టుకుని కోతికి అప్పగించినట్టు కూటమిలో ఐక్యత లేమి బీజేపీకి వరంలా మారుతున్నది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్న ఏకైక లక్ష్యంతో 2023లో దేశంలోని 26 విపక్ష పార్టీలు కలిసి ఇండియా కూటమిని ఏర్పాటు చేసుకున్నాయి. అయితే ఈ కూటమి బీజేపీని దెబ్బతియడం మాత్రం దేవుడెరుగు, అసలు నిలబడగలదా? అని చాలా మంది సందేహపడ్డారు. అయితే ఈ కూటమి తన లక్ష్యాన్ని చేరుకోలేకపోయినా అధికార బీజేపీని మాత్రం దెబ్బతీసిందని చెప్పవచ్చు. 2024 లోక్‌సభ

-మిగతా 3 లో

## కాళేశ్వరం పేరుతో
# ప్రజాధనం లూటీ

### కేసీఆర్ ఇష్టానుసారం కాళేశ్వరం నిర్మాణం

- ఎటిఎంలా ప్రాజెక్ట్ను వాడుకున్న కేసీఆర్
- ఐదు మండలాలపై ఆనాడు నోరు మెదపని కెసిఆర్
- అవినీతిపై కేసీఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్
- రాజ్యసభలో సురేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ ఏప్రిల్ 2( మహాప్రభ

రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాలేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాళేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాలేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు.

-మిగతా 3 లో

## హిమంత శర్మ దేశంలోనే
# 'అత్యంత అవినీతి సీఎం'

- పధాని మోడీ, అమిత్‌షా, హిమంత శర్మలు 'ల్యాండ్ ఎటిఎం' ఏర్పాటు చేశారు

గువహటి ఏప్రిల్ 2( మహాప్రభ

హిమంత బిస్వా శర్మ దేశంలోనే అత్యంత అవినీతి ముఖ్యమంత్రి అని కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గురువారం పేర్కొన్నారు. బకాజన్ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి రతన్ ఎంగ్తికి మద్దతుగా జరిగిన ఎన్నికల సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ, అమిత్‌షా, హిమంత శర్మలు 'ల్యాండ్ ఎటిఎం' ఏర్పాటు చేశారని, పేదలనుండి

-మిగతా 3 లో



# యుద్ధాన్ని ఆపేది లేదు..

- అమెరికాకు అవమానం తప్పదు..
- తేల్చిచెప్పిన ఇరాన్

3



# ఏప్రిల్ 10న రాజ్యసభ సభ్యుడిగా నితీష్ ప్రమాణం

## బిహార్ కొత్త సీఎం ఎవరో తేలేది అప్పుడే



**న్యూఢీల్లీ ఏప్రిల్ 2( మహాప్రభ**
బిహార్ సీఎంగా ఉన్న నితీష్ కుమార్ రాజ్యసభకు ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తన సీఎం పదవికి రాజీనామా చేయబోతున్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఈ నెల 10న ప్రమాణ స్వీకారం చేస్తారు. నితీష్ కుమార్‌తోపాటు కొత్తగా ఎన్నికైన సభ్యులందరూ అదే రోజు ప్రమాణ స్వీకారం చేస్తారు. రాజ్యసభలో ప్రమాణానికి ఈ నెల 9న నితీష్ ఢిల్లీ వెళ్తారు. ఏప్రిల్ 10న ప్రమాణం అనంతరం, ఏప్రిల్ 12న బిహార్ రాజధాని పాట్నాకు తిరిగొస్తారు. ఆ తర్వాత ఆయన తన సీఎం పదవికి రాజీనామా చేస్తారు.ఆలోపు కొత్త సీఎంను ఎన్నుకుంటారు. కొత్త సీఎం ఆధ్వర్యంలో బిహార్ నూతన ప్రభుత్వం ఈ నెల 14న కొలువుదీరే అవకాశం ఉంది. నితీష్ సీఎం పదవి నుంచి తప్పుకోనున్నప్పటికీ, ఆయన భద్రత విషయంలో మాత్రం రాజీపడటం లేదు. రాష్ట్ర హోం శాఖ ఈ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. నితీష్ రాజ్యసభ ఎంపీ అయినప్పటికీ, ఆయనకు సీఎంలకు ఇచ్చే జడ్ం సెక్యూరిటీని కొనసాగించాలని నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై స్పెషల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదేశాలు జారీ అయ్యాయి. జేడీయూ చీఫ్‌గా ఉన్న నితీష్ తన సీఎం పదవికి రాజీనామా చేయడం ఆయన పార్టీ వర్గాల్లో కొంత గందరగోళానికి దారితీసింది. ఇక, నితీష్ తర్వాత ఎవరు సీఎం పదవి చేపడతారు అనే చర్చ కొనసాగుతోంది. ఈ విషయంలో ఎన్‌డీయే కూటమిగా ఉన్న ప్రభుత్వంలో బీజేపీ అభ్యర్థి సీఎం అవుతారని సమాచారం. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న సామ్రాట్ చౌదరి (బీజేపీ) సీఎం రేసులో ముందున్నారు. అలాగే, కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ పేరు కూడా వినిపిస్తోంది. త్వరలో బీజేపీ కార్యనిర్వాహక సమావేశం అనంతరం సీఎంను ఎన్నుకునే అవకాశం ఉంది. కేంద్ర బీజేపీ నాయకుల సూచన మేరకే రాష్ట్రంలో నిర్ణయాలుంటాయి. బీజేపీ గతంలో ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉంది. 20 ఏళ్లుగా కూటమిలో ఉన్నా ఎప్పుడూ నేరుగా అధికారం చేపట్టలేదు. ఈసారి మాత్రం నితీష్ స్థానంలో బీజేపీ అభ్యర్థి సీఎం పదవి చేపట్టబోతున్నారు. ఇక, జేడీయూ కూడా వీలైనన్ని ఎక్కువ మంత్రి పదవులు దక్కించుకోవాలని చూస్తోంది.


# ఎవరెస్ట్ శిఖరంపై భారీ కుంభకోణం..

## ట్రెక్కర్స్ ఆహారంలో ఫుడ్ పాయిజన్




**న్యూఢీల్లీ ఏప్రిల్ 2( మహాప్రభ**
ప్రపంచంలోనే ఎత్తయిన శిఖరంగా ప్రఖ్యాతిగాంచిన మౌంట్ ఎవరెస్ట్ పర్వతారోహకులకు సంబంధించి సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. పర్వాతారోహకులు (ఖతీవఎనివతీం) ట్రెక్కింగ్ చేస్తున్నప్పుడు తీసుకొనే ఆహారాన్ని రహస్యంగా ఫుడ్ పాయిజన్ చేస్తున్నారని తేలింది. కొంతమంది ఒక నెట్‌వర్క్‌లా ఏర్పడి ఈ కుట్రకు పాల్పడుతున్నారని, అత్యవసర పరిస్థితిని సృష్టించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారని నేపాల్ పోలీసులుఅభియోగాలు మోపారు.దర్యాప్తు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎవరెస్ట్ పర్వతారోహకులు తీసుకునే ఆహారంలో బేకింగ్ సోడా మోతాదును పెంచుతున్నారు. దాంతో వారు జీర్ణకోశ సమస్యలకు గురవుతున్నారు. అయితే ఎత్తు కారణంగా ఇలాంటి సమస్యలు తలెత్తుతుంటాయని ట్రెక్కర్లను వారు నమ్మిస్తుంటారు. అప్పుడే వారి భయాన్ని సొమ్ము చేసుకోవడం మొదలవుతుంది. వారిని అత్యవసరంగా ఆస్పత్రులకు తరలించేందుకు హెలికాప్టర్లను రప్పిస్తారు. ఎంత డబ్బయినా చెల్లించేలా అప్పటికే బాధితులను ఒప్పిస్తారు. పక్కాగా జరుగుతున్న ఈ కుట్రలో కొందరు షెర్పాలు, ట్రెక్కింగ్ ఏజెన్సీలు కలిసి పనిచేస్తున్నాయి. తర్వాత నకిలీ వైద్యం, ఫ్లైట్ పత్రాలు చూపించి బీమా సంస్థల నుంచి డబ్బులు పొందుతున్నారని అధికారులు పేర్కొన్నారు. తర్వాత బీమా సొమ్మును షెర్పాలు, హెలికాప్టర్ కంపెనీలు, ట్రెక్కింగ్ ఏజెన్సీలు, నకిలీ పత్రాలు ఇచ్చిన ఆసుపత్రులు పంచుకుంటున్నాయని వెల్లడించారు. ఈ మోసం విలువ 20 మిలియన్ డాలర్లు (సుమారు రూ.186 కోట్లు) అని అంచనా వేశారు. పర్వతాల్లో సహాయక చర్యలు చేపట్టే సంస్థలకు చెందిన ఆరుగురు ఎగ్జిక్యూటివ్‌లను ఈ ఏడాది జనవరిలో అరెస్టు చేసిన తర్వాత ఈ స్కామ్ గురించి వెలుగులోకి వచ్చింది. ఇప్పటివరకు 32 మందిని నేపాల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేపాల్ పర్యాటకంలో ఎంతో కీలకమైన, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎవరెస్ట్ ట్రెక్కింగ్ విషయంలో జరుగుతున్న మోసాన్ని అక్కడి న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ఈ నెట్‌వర్క్‌లో భాగమైన వారికి భారీ స్థాయిలో జరిమానా విధించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. కాగా పర్యాటకుల విషయంలో ఇలాంటి స్కామ్‌లు వెలుగుచూడటం ఇది తొలిసారి కాదు. అందుకే ఈ మోసాల కారణంగా పలు అంతర్జాతీయ బీమా సంస్థలు ఎవరెస్ట్ విజిటర్లకు ఇన్సూరెన్స్ కవరేజ్ ఇవ్వడం నిలిపివేశాయి. ఈ ఘటనలపై అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా కఠిన శిక్షలు లేకపోవడమే నేరాలు పెరగడానికి కారణమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# ఇరాన్‌పై రెండుమూడు వారాల్లో భీకర బాంబు దాడులు చేస్తాం



**న్యూఢీల్లీ ఏప్రిల్ 2( మహాప్రభ**
ఇరాన్ తో జరుగుతున్న యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చీటికిమాటికి బాధ్యతారహిత ప్రకటనలు చేస్తున్నారు. ఓసారి యుద్ధం కొనసాగుతుందని అంటాడు. మరోసారి యుద్ధాన్ని ముగిస్తామని చెబుతాడు. కొన్ని గంటల క్రితమే రెండుమూడు రోజుల్లో ఇరాన్‌తో యుద్ధం ముగుస్తుందని చెప్పిన ట్రంప్.. ఇప్పుడు మళ్లీ మాటమార్చారు. రెండుమూడు వారాల్లో ఇరాన్‌పై భీకర బాంబు దాడులు చేస్తామని హెచ్చరించారు. ఇరాన్ కీలక నాయకత్వం అంతమైందని, ఆ దేశ నౌకాదళం, ఎయిర్‌ఫోర్స్ తుడిచిపెట్టుకుపోయాయని అన్నారు.ఇరాన్ తమతో ఒప్పందానికి రావాలని, లేకపోతే ఆ దేశాన్ని రాతియుగానికి తీసుకెళ్తామని వార్నింగ్ ఇచ్చారు. యుద్ధం ఇప్పట్లో ఆగే పరిస్థితి లేదని, ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ కొనసాగుతోందని అన్నారు. ఇరాన్‌పై నిర్దేశించుకున్న అన్ని లక్ష్యాలను పూర్తిచేసే దిశగా తాము ముందుకుసాగుతున్నామని ట్రంప్ పేర్కొన్నారు. యుద్ధంలో ఇరాన్ భారీగా నష్టపోయిందన్నారు. వారి సైనిక సామర్థ్యాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని చెప్పారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండేందుకు వీలులేదని పునరుద్ఘాటించారు. ఇప్పటివరకు తాము ఇరాన్ చమురును లక్ష్యంగా చేసుకొని దాడి చేయలేదని ట్రంప్ పేర్కొన్నారు. కానీ అవసరమైతే తాము వాటిని కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. అమెరికా భద్రత కోసమే ఈ 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని ప్రారంభించామని వ్యాఖ్యానించారు. యూఎస్‌ను అంతం చేయాలని ఇరాన్ కోరుకుంటోందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఇరాన్‌పై యుద్ధాన్ని త్వరలోనే ముగిస్తామన్నట్లు ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. అమెరికా తన లక్ష్యాలను చేరుకుందని, ఇది అతి త్వరలోనే ముగుస్తుందని అన్నారు. యుద్ధం నేపథ్యంలో ఇంధన ధరలు పెరగడంపై కూడా ఆయన మాట్లాడారు. ఇది తాత్కాలికమేనని అన్నారు. ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ జలసంధి నుంచి వచ్చే చమురుపై యూఎస్ ఆధారపడటం లేదని, భవిష్యత్తులో కూడా దాని అవసరం ఉండదని అన్నారు. దీనిపై ఆధారపడిన దేశాలే ధైర్యాన్ని కూడగట్టుకొని జలసంధిని చూసుకోవాలన్నారు. అయితే ఇరాన్ ప్రతీకార దాడులకు గురవుతున్న గల్ఫ్ దేశాలకు తాము అండగా ఉంటామని ట్రంప్ పేర్కొన్నారు.

# గుజరాత్‌లో భూకంపం




**అహ్మదాబాద్: ఏప్రిల్ 2( మహాప్రభ**
దక్షిణ గుజరాత్‌లోని నవసారి జిల్లాలో గురువారం ఉదయం స్వల్ప భూకంపం సంభవించింది. దీని తీవ్రతను రిక్టర్ స్కేలుపై 3.4గా నమోదు చేశారు. గురువారం ఉదయం 5.27 గంటలకు వాన్స్‌డాకు తూర్పు-ఆగ్నేయంగా 22 కిలోమీటర్ల దూరంలో ఈ భూకంపం సంభవించింది. ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి నష్టం, మరణాలు సంభవించలేదని స్థానిక అధికారులు ధృవీకరించారు. గుజరాత్ రాష్ట్రం అధిక భూకంప సంభావ్యత ఉన్న జోన్‌లో ఉంది. గుజరాత్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (జిఎస్డీఏంఎ) ప్రకారం, గత 200 సంవత్సరాలలో ఈ రాష్ట్రంలో 9 ప్రధాన భూకంపాలు సంభవించాయి. అత్యంత విధ్వంసకరమైన భూకంపాలలో ఒకటి 2001 కచ్ భూకంపం. 2001 జనవరి 26న భాచౌలో సంభవించిన 6.9 తీవ్రత గల ఈ భూకంపం వల్ల సుమారు 13,800 మంది మరణించగా, 1.67 లక్షల మంది గాయపడ్డారు.

# ఐ-ప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

**న్యూఢీల్లీ ఏప్రిల్ 2( మహాప్రభ**
ఇండియాలోనే అతిపెద్ద పొలిటికల్ కన్సల్టెన్సీ అయిన ఐ-ప్యాక్ కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు నిర్వహిస్తోంది. పశ్చిమ బెంగాల్ బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి మనీ లాండరింగ్ అంశంలో విచారణలో భాగంగా ఈడీ కోల్‌కతాలోని ఐప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంతోపాటు హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలోని ఆ సంస్థ కార్యాలయాల్లో సోదాలు కొనసాగిస్తోంది.బొగ్గు స్మగ్లింగ్‌కు సంబంధించి మనీ లాండరింగ్ కేసులో కొంతకాలంగా సోదాలు జరుగుతున్నాయి. 2019 లోక్ సభ ఎన్నికల తర్వాత ఐప్యాక్ నుంచి టీఎంసీతో కలిసి పనిచేస్తోంది. ఐప్యాక్ కన్సెల్టెన్సీ డైరెక్టర్లలో ఒకరైన రిషిరాజ్ సింగ్‌కు చెందిన ప్రాంగణంపై కూడా దర్యాప్తు సంస్థ ఇప్పటికే దృష్టి సారించింది. కొన్ని నెలల క్రితం బెంగాల్‌లో ఈడీ రైడ్స్ చర్చనీయాంశమైన విషయం తెలిసిందే సోదాలు జరుగుతున్న సమయంలో పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఐప్యాక్ చీఫ్ ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో ఆయన ఇంటిపై కూడా సోదాలు నిర్వహించారు.

# 167 కోట్లు పలికిన రవివర్మ పెయింటింగ్..

## యశోదాకృష్ణుల ఫోటోను కొన్న సైరస్ పూనావాలా



**ముంబై ఏప్రిల్ 2( మహాప్రభ**
ప్రఖ్యాత చిత్రకారుడు రాజా రవివర్మ గీసిన బొమ్మ భారీ ధర పలికింది. యశోద, కృష్ణుడు ఉన్న ఫోటో సుమారు 167 కోట్లకు అమ్ముడుపోయింది. భారతీయ ఆర్ట్‌వర్క్ ఆ ధరకు అమ్ముడుపోవడం ఇదే మొదటిసారి. వేలంలో కొత్త వరల్డ్ రికార్డు స్థాపించినట్లు చెబుతున్నారు. రవివర్మ గీసిన ఆయిల్ పెయింటింగ్‌ను సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా స్థాపకుడు డాక్టర్ సైరస్ ఎస్ పూనావాలా సొంతం చేసుకున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీన జరిగిన ఆర్ట్స్ స్ప్రింగ్ లైవ్ ఆక్షన్‌లో ఆ బొమ్మ అమ్ముడుపోయింది. 1890 దశకంలో రవివర్మ ఆ పెయింటింగ్ వేసినట్లు భావిస్తున్నారు. రవివర్మ ఆ సమయంలో తన కెరీర్‌లో అగ్రస్థానంలో ఉన్నారు. తల్లి యశోదమ్మతో కన్నయ్య ఉన్న ఆ ఫోటో ఆర్ట్స్ లవర్స్‌ను విశేషంగా ఆకర్షిస్తోంది. రవివర్మ వేసిన యశోద, కృష్ణుల ఫోటోను సొంతం చేసుకోవడం అద్భుతంగా భావిస్తున్నట్లు డాక్టర్ పూనావాలా తెలిపారు.ఇది జాతీయ సంపద అన్నారు. గతంలో భారతీయ చిత్రకారుడు ఎంఎఫ్ హుస్సేన్ వేసిన గ్రామ్ యాత్ర పెయింటింగ్ 118 కోట్లకు వేలంలో అమ్ముడుపోయిన విషయం తెలిసిందే.

# ఇండోనేషియాలో భారీ భూకంపం..

## ఒకరి మృతి, పలు ఇళ్లు ధ్వంసం



**న్యూఢీల్లీ ఏప్రిల్ 2( మహాప్రభ**
ఇండోనేషియాలో గురువారం(ఏప్రిల్2) తెల్లవారుజామున భారీ భూకంపం సంభవించింది. తూర్పు ఇండోనేషియాలో 7.4 తీవ్రతతో భూకంపం సంభవించింది. భూకంపంతో ఒకరు చనిపోయారు. మరికొన్ని ఇండ్లు ధ్వంసమయ్యాయి. 75 సెం.మీ. ఎత్తు వరకు అలలు ఎగిసిపడ్డాయి. టెర్నెట్ ద్వీపానికి 127 కిలోమీటర్ల దూరంలో మొలుక్కా సముద్రంలో భూకంప కేంద్రం ఉంది. భూకంప కేంద్రానికి 1,000 కిలోమీటర్ల పరిధిలో ప్రమాదకర సునామీ అలలు ఎగసిపడే అవకాశం ఉందని యూఎస్ పర్యవేక్షణ కేంద్రం హెచ్చరిక జారీ చేసింది . దీంతో ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, మలేషియా ప్రభుత్వాలు సునామీ హెచ్చరికలు జారీ చేశాయి. అప్రమత్తమైన స్థానిక అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు

# హిమంత శర్మ దేశంలోనే 'అత్యంత అవినీతి సిఎం'



**న్యూఢీల్లీ ఏప్రిల్ 2( మహాప్రభ**
హిమంత బిస్వా శర్మ దేశంలోనే అత్యంత అవినీతి ముఖ్యమంత్రి అని కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గురువారం పేర్కొన్నారు. బకాజన్ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి రతన్ ఎంగ్తికి మద్దతుగా జరిగిన ఎన్నికల సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ, అమిత్‌షా, హిమంత శర్మలు 'ల్యాండ్ ఎటిఎం' ఏర్పాటు చేశారని, పేదలనుండి భూమిని దోచుకుని కార్పోరేట్లకు దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొత్తం 98,400 బిగాల భూమిని ముగ్గురు కార్పోరేట్లకు దోచిపెట్టారని అన్నారు. భారత్‌లోనే అత్యంత అవినీతి ముఖ్యమంత్రి హిమంత బిస్వాశర్మ అని, ఆయన కుటుంబం కూడా అవినీతిలో నెం.1 అని అన్నారు. వారి అవినీతికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అవినీతి ఆరోపణల కారణంగానే హిమంత ప్రధాని మోడీ నియంత్రణలో ఉన్నారని, సిండికేట్ల ద్వారా ఆయన అస్సాంలో పాలన చేస్తున్నారని అన్నారు. ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ రాష్ట్రానికి, ప్రజలకు అండగా నిలిచారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా కాంగ్రెస్ పార్టీ ఆయన మృతికి న్యాయం చేకూరుస్తుందని హామీ ఇచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(ఎ)ని పూర్తిగా అమలు చేస్తామని హామీ ఇస్తున్నామని అన్నారు. కార్బీ ఆంగ్లాంగ్, ఆరవ షెడ్యూల్ పరిధిలోని అన్ని ప్రాంతాల పాలన గువహటి లేదా ఢిల్లీ నుండి కాకుండా స్థానిక ప్రజల చేతుల్లోనే ఉంటుందని అన్నారు.

# యుడిఎఫ్ మేనిఫెస్టో విడుదల



**తిరువనంతపురం న్యూఢీల్లీ ఏప్రిల్ 2( మహాప్రభ**
కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) ఎన్నికల మేనిఫెస్టోని గురువారం విడుదల చేసింది. ప్రతిక్షనాయకుడు, కాంగ్రెస్ నాయకుడు విడి సతీశన్, ఇతర యుడిఎఫ్ నాయకులు కలిసి మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. యుడిఎఫ్ ప్రధానంగా ఐదు హామీలనిచ్చింది. మహిళలకు ఉచిత బస్సు, విద్యార్థినులకు వెయ్యి రూపాయలు, మాజీ ముఖ్యమంత్రి ఉమెన్ చాందీ పేరు మీద 25 లక్షల రూపాయల ఆరోగ్య బీమా పథకం, సంక్షేమ పింఛను మూడు వేలకు పెంపు,యువ పారిశ్రామికవేత్తలకు వడ్డీ లేని రుణాలు వంటివి హామీలనిచ్చింది.

## 53 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర

మొదటి తరువాయి

వ్యోమగాముల బందం చంద్రుని చుట్టూ పది రోజుల పాటు ప్రయాణించి, అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డులను సష్టించబోతోంది.

విజయవంతమైతే..నేరుగా చంద్రుడి పైకి

ఆర్టెమిస్-2 అనేది ఒక ప్రయోగం మాత్రమే కాదు. చంద్రునిపై శాశ్వత మానవ ఉనికిని ఏర్పాటు చేసే 'ఆర్టెమిస్ ప్రోగ్రామ్'లో అత్యంత కీలకమైనది. చంద్రుని ఉపరితలంపై మనుషులను దించడానికి ముందు చేసే కీలక పరీక్షలాంటిది. వాస్తవానికి ఈ ప్రయోగం ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6:24 గంటలకు జరగాల్సి ఉంది. అయితే కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నాసా సాంకేతిక బందాలు సత్వరమే స్పందించి సమస్యను పరిష్కరించడంతో ప్రయోగం సజావుగా సాగింది.

ఈ పది రోజుల యాత్రలో వ్యోమగాములు కీలక పరిశోధనలను చేయనున్నారు. భూమి నుంచి సుమారు 4 లక్షల కిలోమీటర్ల అవతలికి వీరు వెళ్లే అవకాశం ఉంది. వ్యోమగాముల ప్రాణాలను రక్షించే లైఫ్ సపోర్ట్ సిస్టమ్స్, కమ్యూనికేషన్, నావిగేషన్ వ్యవస్థలు చంద్రుని వద్ద ఎలా పనిచేస్తాయో వీరు పరిశీలించనున్నారు. ఈ మిషన్ విజయవంతమైతే, 'ఆర్టెమిస్ -3' ద్వారా చంద్రునిపై మనుషులను నేరుగా దించే ప్రక్రియ మరింత సులభతరం కానుంది. 1972లో అపోలో-17 తర్వాత, మళ్లీ ఇప్పుడు మానవ మేధస్సు చంద్రుడిని తాకేందుకు సిద్ధమైంది. భవిష్యత్ పరిశోధనలు, ప్రయోగాలలకు ఇది కీలకం కానున్నది.

## నిర్భయంగా ఓటేయండి..

మొదటి తరువాయి

భయపడవద్దని అమిత్ షా సూచించారు. "ఈసారి ఓటర్లకు భయం లేదు. బెంగాల్ ఓటర్లు ఓటు వేయకుండా ఏ గూండా అడ్డుకోలేడు. భయం లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. టీఎంసీని బంగాళాఖాతంలో కలపాలి. భవానిపూర్‌లో మార్పు కోరుకుంటున్నారా.. లేదా..? మీరు సువేందు అధికారికి ఓటు వేయాలి అని అడిగేందుకు ఇక్కడికి వచ్చాను. ఈసారి బెంగాల్‌లోనే కాకుండా.. మమతా బెనర్జీ నియోజకవర్గమైన భవానిపూర్‌లో కూడా మార్పు రాబోతుంది" అని అమిత్ షా వ్యాఖ్యానించారు. బెంగాల్ బీజేపీ అధ్యక్షుడైన సువేందు అధికారి మమతా బెనర్జీ నియోజకవర్గమైన భవానిపూర్ నుంచి పోటీ చేస్తున్నారు. టీఎంసీ ప్రభుత్వాన్ని గద్దెదించడంతోపాటు మమత నియోజకవర్గంలోనే ఆమెను ఓడించాలనే లక్ష్యంతో బీజేపీ ఈ నిర్ణయం తీసుకుంది. గురువారం నాడు సువేందు అధికారి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి అమిత్ షా కూడా హాజరయ్యారు. ఆయన ఈ కార్యక్రమానికి హాజరుకావడం బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని, సువేందు అధికారి గెలుపునకు ఉపయోగపడుతుందని అక్కడి నేతలు అంటున్నారు. ఈ నియోజకవర్గాన్ని, మమత ఓటమిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ.. త్వరలో ఇక్కడ ప్రధాని మోదీతో కూడా ప్రచారం చేయించబోతుంది. పశ్చిమ బెంగాల్‌లో ఈ నెల 23, 29 తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి.

## గాజాలో శైశవయాత్ర!



**గాజా సిటీ:** గాజాలో కొందరు చిన్నపిల్లలు తమ బొమ్మతో సరదాగా ఆడిన ఆట చూపరులకు కంటతడి పెట్టిస్తూ అక్కడి విషాద పరిస్థితులకు అద్దం పడుతున్నది. కొంతమంది పిల్లలు కలిసి ఒక బొమ్మను పాడెపై శవాన్ని ఎత్తినట్టు అతి జాగ్రత్తగా పైకెత్తి చిన్న స్ట్రెచ్చర్‌పై ఉంచి, శవయాత్ర మాదిరిగా దానిని మోస్తూ మెల్లిగా నడుస్తుండగా, మరికొందరు మౌనంగా నడుస్తూ వెళ్తున్న వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.ఒక శవయాత్ర పిల్లలకు కొత్త ఆటలా మారిందంటే గాజాలో నెలకొన్న విషాదం, శవయాత్రలు వారికి నిత్యకృత్యంగా మారిన పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. ఇజ్రాయెల్ దాడులతో ప్రతి రోజూ పదుల సంఖ్యలో పౌరులు మరణించడం, వారి అంతిమ యాత్రలు నిత్యకృత్యంగా మారడంతో పిల్లలు ఈ అంతిమయాత్రనే ఒక కొత్త ఆటగా భావించి ఆనందపడటం నిజంగా దురదృష్టమే

## భారత్‌కు ఇజ్రాయిల్ లైట్ మెషిన్ గన్స్

మొదటి తరువాయి

NE+EV 7.62x51 ఎల్ఎంజీ ఆయుధాలను భారత్‌కు అందించింది. అదనంగా మరో 4,000 యూనిట్లను ఈ ఏడాది చివరలో అందించనున్నట్టు ఇజ్రాయిల్ వెపన్స్ ఇండస్ట్రీస్ (ఐడబ్ల్యూఐ) ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది.

**పీఎల్ ఆర్ సిస్టమ్స్ ద్వారా సరఫరా**

ఈ ఆయుధాలను అదానీ గ్రూప్, ఐడబ్ల్యూఐల సంయుక్త సంస్థ అయిన పీఎల్ ఆర్ సిస్టమ్స్ ద్వారా ఈ సరఫరా జరిగింది. ఇవి భారత్‌లో ప్రయివేట్ రంగంలో చిన్న ఆయుధాలు, మందుగుండు సామగ్రిని తయారుచేస్తున్న తొలి సంస్థగా పీఎల్ఆర్ సిస్టమ్స్ గుర్తింపు పొందింది. టెక్నాలజీ బదిలీ ప్రక్రియ విజయవంతంగా పూర్తవడంతో, దేశీయంగా తయారీ చేపట్టడం సాధ్యమైందని సంస్థ పేర్కొంది.

**ఎల్ఎంజీ ప్రత్యేకత ఏంటంటే!**

నెగెవ్ 7.62 ఎల్ఎంజీ అత్యంత తేలికైన మెషీన్ గన్స్‌లో ఒకటి. కఠిన పరిస్థితుల్లో కూడా అత్యంత కచ్చితత్వంతో పనిచేసేలా దీన్ని రూపొందించారు. ఈ ఆయుధాన్ని ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) ఇప్పటికే ఉపయోగిస్తున్నాయి. లక్ష్యాన్ని చేరుకునే సామర్థ్యం వీటికి ఉంది. ఈ ఎల్ఎంజీకి సెమీ-ఆటోమేటిక్, ఫుల్-ఆటోమేటిక్ అనే రెండు రకాల విధానాలు ఉన్నాయి. అవసరాన్ని బట్టి భూమిపై మాత్రమే కాకుండా హెలికాప్టర్లు, వాహనాలు, నౌకలపై కూడా అమర్చే సౌకర్యం కల్పించారు.

**కచ్చితమైన లక్ష్యంతో టార్గెట్ ఛేదన!**

ఇది సైనిక చర్యల్లో విస్తృత వినియోగాన్ని అందిస్తుంది. దీని తేలికపాటి డిజైన్, అలాగే 7.62 మిల్లీమీటర్ గుండు సామర్థ్యం కారణంగా బలమైన కవర్‌ను కూడా ఛేదించే శక్తి దీనికి ఉంది. దీంతో పట్టణ యుద్ధ పరిస్థితుల్లో, ముఖ్యమైన ఆపరేషన్లలో ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. తక్కువ వెలుతురు కూడా కచ్చితమైన లక్ష్య సాధన కోసం పికాటిన్నీ రైల్స్, ట్రిటియం నైట్ సైట్స్‌ను ఇందులో అమర్చారు. అయితే, నాటో ప్రమాణాలకు అనుగుణంగా ఈ ఆయుధాలను రూపొందించారు. ఈ ఆయుధం దీర్ఘకాలిక వినియోగానికి అనుకూలంగా ఉంటుంది. అదనంగా కంప్యూటరైజ్డ్ వెపన్ సిస్టమ్‌తో అనుసంధానం చేసే సౌకర్యం ఉండటం వల్ల ఎంత ఒత్తిడిలోనైనా లక్ష్యాలను కచ్చితంగా ఛేదించగలదు.

## హిమంత శర్మ దేశంలోనే 'అత్యంత అవినీతి సిఎం'

మొదటి తరువాయి

భూమిని దోచుకుని కార్పోరేట్లకు దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొత్తం 98,400 బిగాల భూమిని ముగ్గురు కార్పోరేట్లకు దోచిపెట్టారని అన్నారు. భారత్‌లోనే అత్యంత అవినీతి ముఖ్యమంత్రి హిమంత బిస్వాశర్మ అని, ఆయన కుటుంబం కూడా అవినీతిలో నెం.1 అని అన్నారు. వారి అవినీతికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అవినీతి ఆరోపణల కారణంగానే హిమంత ప్రధాని మోడీ నియంత్రణలో ఉన్నారని, సిండికేట్ల ద్వారా ఆయన అస్సాంలో పాలన చేస్తున్నారని అన్నారు. ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ రాష్ట్రానికి, ప్రజలకు అండగా నిలిచారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా కాంగ్రెస్ పార్టీ ఆయన మృతికి న్యాయం చేకూరుస్తుందని హామీ ఇచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(ఎ)ని పూర్తిగా అమలు చేస్తామని హామీ ఇస్తున్నామని అన్నారు. కార్బీ ఆంగ్లాంగ్, ఆరవ షెడ్యూల్ పరిధిలోని అన్ని ప్రాంతాల పాలన గువహటి లేదా ఢిల్లీ నుండి కాకుండా స్థానిక ప్రజల చేతుల్లోనే ఉంటుందని అన్నారు

## సన్‌రైజర్స్ పవర్ పంచ్

మొదటి తరువాయి

భారీస్కోర్ చేసింది. అనంతరం కోల్‌కతా నైట్‌రైడర్స్ పవర్‌ప్లే 6ఓవర్లు ముగిసేసరికి 74 పరుగులు చేసి గెలుపుపై ఆశలు రేపినా.. ఆ తర్వాత సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 161 పరుగులకే కుప్పకూలింది. కోల్‌కతా బ్యాటర్లు రఘువంశీ(52), రింకు సింగ్(35), అలెన్(28) మాత్రమే రాణించగా.. కెప్టెన్ రహానే(8), గ్రీన్(2), అనుకుల్ రారు(2)కి తోడు లోయర్ ఆర్డర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. సన్‌రైజర్స్ బౌలర్లు ఉనాద్కట్‌కు మూడు, ఈషన్ మలింగ, నితీశ్‌కుమార్ రెడ్డికి రెండేసి వికెట్లు దక్కాయి.

అంతకుముందు సన్‌రైజర్స్ పవర్ ప్లే 6 ఓవర్లు ముగిసేసరికి సన్‌రైజర్స్ జట్టు వికెట్ నష్టానికి 84పరుగులు చేయగా.. ఆ తర్వాత కోల్‌కతా ఓపెనర్లు అభిషేక్ శర్మ (21 బంతుల్లో 48; 4 ఫోర్లు, 4 సిక్సర్లు), ట్రెవిస్ హెడ్ (21 బంతుల్లో 46; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (14) అదే జోరును కొనసాగించే క్రమంలో ఔటయ్యాడు. అనికేత్ వర్మ ఒక్క పరుగుకే ఔటై నిరాశపరిచాడు. ఆ తర్వాత క్లాసెన్(52; 35బంతుల్లో 4ఫోర్లు, సిక్సర్)కి తోడు నితీశ్ కుమార్ రెడ్డి (39) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 226పరుగులు చేసింది. కోల్‌కతా బౌలర్లు ముజరబ్బానికి నాలుగు, వైభవ్ అరోరాకు రెండు, కార్తీక్ త్యాగి, అనుకుల్ రారుకు ఒక్కో వికెట్ దక్కాయి.

**స్కోర్‌బోర్డు...**

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి)గ్రీన్ (బి)కార్తీక్ త్యాగి 46, అభిషేక్ శర్మ (సి)వరుణ్ చక్రవర్తి (బి)ముజరబ్బాని 48, ఇషాన్ కిషన్ (సి)రింకు సింగ్ (బి)ముజరబ్బాని 14, క్లాసెన్ (సి)రమణ్‌దీప్ సింగ్ (బి)ముజరబ్బాని 52, అనికేత్ వర్మ (సి)రింకు సింగ్ (బి)అనుకుల్ రారు 1, నితీశ్ కుమార్ రెడ్డి (సి)వరుణ్ చక్రవర్తి (బి)వైభవ్ అరోరా 39, సలీల్ అరోరా (బి)వైభవ్ అరోరా 0, హర్ష్ దూబే (నాటౌట్) 9, శివాంగ్ కుమార్ (సి)రహానే (బి)ముజరబ్బాని 4, అదనం 13. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 226పరుగులు)

వికెట్ల పతనం: 1/82, 2/111, 3/112, 4/118, 5/200, 6/222, 8/226

బౌలింగ్: వైభవ్ అరోరా 4-0-47-2, ముజరబ్బాని 4-0-41-4, నరైన్ 4-0-39-0, వరణ్ చక్రవర్తి 2-0-31-0, కార్తీక్ త్యాగి 4-0-48-1, అనుకుల్ రారు 2-0-12-1.

## అమరావతికి ఆమోదముద్ర

మొదటి తరువాయి

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాజ్యసభ చైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మొత్తంగా ఎపి రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. 'ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు'కు రాజ్యసభ ఆమోదం తెలిపింది. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందగా, ఇప్పటికే లోక్‌సభలోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించిన విషయం తెలిసిందే. దీంతో పార్లమెంట్ ఉభయసభల ఆమోదం పొందిన ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదానికి పంపబడనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అధికారికంగా చట్టబద్ధత పొందనుంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు.

ముఖ్యంగా రాజధాని విషయంలో ఉన్న అనిశ్చితి తొలగిపోవడం పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రాజ్యసభలో ఈ బిల్లుపై జరిగిన చర్చ అనంతరం కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ సమాధానం ఇచ్చారు. ఏపీ రాజధాని అంశంపై ఉన్న అస్పష్టత పూర్తిగా తొలగిపోయిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధప్రదేశ్ ప్రజలకు శుభాభినందనలు తెలిపారు. ఇక, రాజ్యసభ విజిటర్స్ గ్యాలరీలో ఈ చర్చను వీక్షించిన ఏపీ మంత్రి నారా లోకేష్, ఇతర ఎంపీలు బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఆనందాన్ని పంచుకున్నారు. 'జై అమరావతి' నినాదాలతో ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు.



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కౌగిలించుకుని, బిల్లు పై ఆయన చక్కగా మాట్లాడారని అభినందించారు. మొత్తంగా, అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ, రాజ్యసభలు ఏకగ్రీవంగా ఆమోదించడం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపనుంది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఎంసీ, ఆప్, బీజేడీ, ఆర్జేడీ, బీఆర్ఎస్, జేడీ(యూ), శివసేన మద్దతు ఇచ్చాయి. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధతపై జరిగిన చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. 17 మంది సభ్యులు చర్చలో పాల్గొన్నారు. అయితే రాజ్యసభలో సైతం ఈ బిల్లును వైసీపీ వ్యతిరేకించింది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. అలాగే బుధవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగింది. ఈ చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. ఇక ఇటీవల ఏపీ అసెంబ్లీలో 11 గంటల 11 నిమిషాలకు ఈ బిల్లును ప్రభుత్వం పెట్టిన సంగతి తెలిసిందే. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంతో కూటమిలోని పార్టీల ఎంపీలకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పలు పార్టీల నాయకులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను స్వయంగా కలిసి మంత్రి నారా లోకేశ్‌తోపాటు కూటమి ఎంపీలు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందడంతో రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేశారు.పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ బిల్లు పాస్ కావడంతో రాజధాని అమరావతిలో సంబరాలు మిన్నంటాయి. మోకాళ్ళపై నిలబడి పార్లమెంటులో ఈ బిల్లుకు మద్దతిచ్చిన పార్టీలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు రాజధాని ప్రాంత రైతులు పాలాభిషేకం చేశారు. దాంతో ఆ ప్రాంతంలోని ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేసిన రాజధాని అమరావతి బిల్లును ఇటీవల కేంద్రానికి పంపారు. ఈ బిల్లు బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందడంతో.. రాజ్యసభకు పంపారు. ఈ బిల్లుపై గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. అనంతరం ఈ బిల్లు ఆమోదం పొందింది. ఉభయ సభలు ఆమోదం పొందడంతో.. ఈ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం కోసం రాష్ట్రపతి భవన్‌కు పంపనున్నారు.


### కాళేశ్వరం పేరుతో
## ప్రజాధనం లూటీ

మొదటి తరువాయి

ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారని కిషన్‌రెడ్డి అన్నారు.

### కాళేశ్వర జలాలు చూపిస్తం..
## వచ్చే దమ్ముందా!

మొదటి తరువాయి



మరచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనం. బీజేపీ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదారులు, ప్రాజెక్టులకు మీ సొంత పైసలు ఖర్చు పెడు తున్నారా? ఆ నోట్లను దుబాయ్‌లో ముద్రిస్తు న్నారా? లేక మీ జేబుల్లో నుంచి ఖర్చు చేస్తున్నా రా? కాళేశ్వరం వల్ల ఉపయోగం లేదని గొంతు చించుకున్న కిషన్‌రెడ్డీ.. గతంలో మీ ప్రభుత్వ పెద్దలే నితిన్‌గడరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధం అంటారా? అవివేకం అంటారా? తాజా పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా (చాప్టర్ 8) రిపోర్ట్ ప్రకారం.. '2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2023 నాటికి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే'నని కుండబద్దలు కొట్టింది. ఇది మీ కండ్లకు కనిపించడం లేదా? సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిందే చెవుల్లోకి వెళ్తుందా?' అని నిలదీశారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ తెలంగాణ గొంతు కోసేలా కిషన్‌రెడ్డి మా ట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. రాజ్యస భలో కిషన్‌రెడ్డి పచ్చి అబద్ధాలు, చరిత్ర వక్రీకర ణలతో వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని మం డిప డ్డారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కిషన్‌రెడ్డి నేడు మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## ఢిల్లీలో దోస్తీ..రాష్ట్రంలో కుస్తీ!..

మొదటి తరువాయి

ఎన్నికల్లో మునుపటి కన్నా సీట్లు తగ్గి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని స్థాయికి బీజేపీ చేరుకుంది. అయితే లోక్‌సభ ఎన్నికల్లో కూటమి పార్టీలు చూపిన ఐక్యత రాష్ట్రాల విషయానికొచ్చే సరికి పలచబడింది. రాష్ట్రంలో ఎవరి ప్రయోజనాలు వారికి ఉండటంతో కూటమి పార్టీల మధ్య సమన్వయం కొరవడింది. రానురాను కేంద్రంలో దోస్తీ, రాష్ట్రంలో కుస్తీ తరహాలో ఇండియా కూటమి రాజకీయాలు మారాయి. దేశ వ్యాప్తంగా బలహీన పడిన జాతీయ పార్టీ కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పేరుతో బలం పుంజుకోవాలని ప్రయత్నించినా ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ, ఇతర పార్టీలు దానికి ఆ అవకాశం ఇవ్వలేదు. కాంగ్రెస్ ఒంటెద్దు పోకడలూ కూటమికి బీటలు వారుస్తున్నాయి.

కాంగ్రెస్‌కు ఊతమెందుకు ఇస్తాం: మమత

ప్రస్తుతం బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సంగతి తీసుకుంటే కూటమిలో భాగస్వాములైనప్పటికీ మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ, కాంగ్రెస్ విడివిడిగానే పోటీ చేస్తున్నాయి. ఇక్కడ ఇండియా కూటమికి సంబంధించి ఎలాంటి పొత్తు లేదు. బెంగాల్‌లో కాంగ్రెస్‌కు ఏమాత్రం పట్టులేదని, అలాంటి పార్టీ కోసం తమ బలాన్ని ఎందుకు ఉపయోగిస్తామని మమత ప్రశ్నిస్తూ, ఈ ఎన్నికల్లో తాము సొంతంగానే పోటీ చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో టీఎంసీ, కాంగ్రెస్-వామపక్ష, బీజేపీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది.

## యుద్ధాన్ని ఆపేది లేదు..

**అమెరికాకు అవమానం తప్పదు.. తేల్చిచెప్పిన ఇరాన్**



**న్యూఢిల్లీ**

అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇరాన్ భారీ హెచ్చరిక జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లో యుద్ధాన్ని ఆపేది లేదని స్పష్టం చేసింది. అమెరికా బెదిరింపులకు లొంగబోమని తెలిపింది. యుద్ధం ముగింపుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రకరకాల ప్రకటనలు చేస్తున్న వేళ ఇరాన్ చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. ఈ మేరకు ఇండియాలోని ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియా వేదికగా ఈ ప్రకటన చేసింది.'మేం అమెరికా బాంబుల కారణంగా రాతియుగంలోకి వెళ్లడం లేదు. మాకు 7,000 ఏళ్ల నాగరిక చరిత్ర ఉంది. చరిత్రకు ఈ విషయం తెలుసు. అమాయకులైన పిల్లల్ని చంపి, అమానవీయ నేరాలు చేస్తున్న మీరు రాతియుగాన్ని ఆధునిక ప్రపంచంలోకి తెచ్చారు అనేది స్పష్టం" అని తన ట్వీట్‌లో పేర్కొంది. ఇరాన్‌తో యుద్ధంపై బుధవారం రాత్రి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. తాము ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం కారణంగా ఆ దేశం రాతియుగంలోకి వెళుతుందన్నారు. ఇరాన్ సైన్యం, నేవీ పూర్తిగా బలహీనపడిపోయాయని చెప్పారు. యుద్ధాన్ని రెండు, మూడు వారాల్లో ముగిస్తామన్నారు. అయితే, ఇరాన్ మిలిటరీ మాత్రం ట్రంప్ ప్రకటనకు ధీటుగా స్పందించింది. అమెరికాకు తీవ్ర అవమానం జరిగే వరకు యుద్ధాన్ని వదలేది లేదని, అమెరికా పశ్చాత్తాప పడి, లొంగిపోయే వరకు తమ దాడులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఇరాన్ మిలిటరీకి నష్టం జరిగిందన్న అమెరికా ఆరోపణల్ని కూడా ఆ దేశం ఖండించింది. అమెరికా తమను తక్కువగా అంచనా వేసిందని అభిప్రాయపడింది. ఇరాన్ సైనిక ప్రతినిధి ఒకరు ఈ వ్యాఖ్యలు చేశారు. తమ దేశం దగ్గరున్న సైనిక శక్తి, మిస్సైళ్ల తయారీ గురించి అమెరికా ఇంటెలిజెన్స్‌కు సరిగ్గా తెలియదన్నారు. లాంగ్ రేంజ్ అటాక్ మిస్సైల్స్ డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, స్పెషలైజ్డ్ ఎక్విప్‌మెంట్ వంటివి తమ దేశం దగ్గరున్నాయని ఇరాన్ ప్రతినిధి మీడియాతో తెలిపారు.

# సంపాదకీయం

## జగన్....
## చపలచిత్త రాజకీయాలు



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజకీయాలు సూస్తుంటే ..ఇంతటి అపరిపక్వ రాజకీయ నేతను చూసి ఉండమేమో అనిపిస్తుంది. చంద్రబాబు మీద వ్యతిరేకత ఉన్నవారు సైతం రాజధాని విషయంలో వ్యతిరేకించడం లేదు. ఏ విషయంలోనూ స్పష్టత లేని జగన్ ఐదేళ్ల పాటు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేశారు. అతి తక్కువ సమయంలో సిఎంగా ప్రజలు ఆదరిస్తే, దానిని అద్భుత అవకాశంగా తీసుకుని, దార్శనికతను ప్రదర్శించాల్సిన జగన్, తన ఫ్యాక్షన్ రాజకీయతనుజోడించి అభాసుపాలయ్యారు. అధికారంలో ఉండగా మూడు రాజధానులు అంటూ, రాజధాని రైతులను రాచిరంపాన పెట్టారు. అమరావతి ని వేశ్యల రాజధాని అన్నారు. అదో కమ్మ సామ్రాజ్యం అన్నారు. మూడు రాజధానులంటూ ఊదరగొట్టి, అసలు రాజధాని లేకుండా ఐదేళ్లు కాలం గడిపారు. ఇప్పుడేమో మావిగన్ అంటూ జగన్ కొత్త పల్లవి అందుకున్నారు. ఇవన్నీ చూస్తుంటే జగన్‌లో ఓ అపరిచితుడు ఉన్నాడా అన్న అనుమానాలు కలుగు తున్నాయి. రాజధాని అమరావతి రైతులకు న్యాయం జరగడం లేదంటున్న వ్యక్తి, తన సొంతింట్లో సొంత చెల్లెలికి మాత్రం న్యాయం చ ఏయడం లేదు. హక్కుగా ఉన్న ఆస్తిని పంచడం లేదు. తల్లి చెప్పినా వినడం లేదు. అంతెందుకు రాజధాని విషయంలో ఏం మాట్లాడుతున్నారో ఆయనకైనా అర్థం అవుతందా అన్నది అర్థం కావడం లేదు. మూడు రాజధానులు అన్నారు. అసలు రాజధాని అవసరం లేదంటున్నాడు. మావిగన్ అంటున్నాడు. అంటే చిత్తశుద్ధి, స్థిర సంకల్పం లేని రాజకీయ నేతగా జగన్‌ను చూడాలి. ఇలాంటి వారు అధికారంలో ఉండగా ఎంతగా తెగించారో చూశాం. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్.. ఇప్పుడు 'ప్లాన్-బి' పేరుతో కొత్త పల్లవి అందుకున్నారు. విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ నచ్చకపోతే.. ప్లాన్-బీ కింద మచిలీపట్నం (మా) -విజయవాడ (వి)-గుంటూరు (గన్) నగరాలను రాజధానిగా అభివృద్ధి చేయొచ్చని సెలవిచ్చారు. దీనికి ఎంచక్కా 'మావిగన్' అని పేరు పెట్టొచ్చన్నారు. 'గన్'లో తన పేరు ఉన్నందున, అది నచ్చకపోతే ఇంకోపేరు పెట్టుకోవచ్చని కూడా సలహా ఇచ్చారు. మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు మధ్య 110 కిలోమీటర్ల హైవే ప్రాంతం పరిధిలో 110 ఎకరాల్లో రాజధాని నగరాన్ని ఏర్పాటు చేయొచ్చని జగన్ పేర్కొన్నారు. 'మావిగన్'పై తన అభిప్రాయాన్ని విన్నాక .. రాష్ట్ర ప్రజలు తనతో ఏకీభవిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అమరావతి మాత్రం ఆచరణ సాధ్యం కాదని తేల్చేశారు. భవిష్యత్తులో తమ ప్రభుత్వం వచ్చాక అసెంబ్లీలో చట్ట సవరణ ద్వారా రాజధానిని మార్చేస్తామని కూడా ప్రకటించారు. గతంలో తుగ్లక్ కూడా ఇలాగే చేశారు. ఇష్టం వచ్చినట్లుగా రాజధానిని మార్చేశారు. ఇప్పుడు జగన్ చేస్తున్న లేదా చెబుతున్నది అలాగే ఉంది. అంతెందుకు అసలు రాష్ట్రాలకు రాజదాని అసవరం లేదని సెలవిచ్చారు. గతంలో ఆయనగారు తాను అంటే సిఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అన్నారు. దీనిపై మాజీమంత్రి సోమిరెడ్డి సెటైర్లు వేశారు. లాట్రిన్‌లో ఉంటే అదే రాజదాని అవుతుందనుకోవాలా అని ఆన్నారు. రాజ్యాంగంలో దేశ రాజధానిపై నిర్వచనం ఉందే తప్ప.. రాష్ట్రాల రాజధాని ప్రస్తావనే ఎక్కడా లేదని జగన్ చెప్పడం ఆయన అవివేకానికి పరాకాష్టగా చెప్పుకోవాలి. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేసినా నిలువదంటున్నారు. భవిష్యత్‌లో ప్రజాభీష్టం మేరకు ఏర్పడే రాష్ట్రప్రభుత్వం.. రాజధానిని అమరావతి నుంచి మారుస్తూ చట్టసవరణ చేయవచ్చని కూడా సెలవిచ్చారు. అమరావతికి తాను ఏనాడూ వ్యతిరేకం కాదని, అందుకే శాసన రాజధానిగా ఏర్పాటు చేశానని తెలిపారు. అమరావతికి ఏ ఒక్కరూ వ్యతిరేకం కాదని, రాజధాని పేరిట చేస్తున్న అవినీతికే వ్యతిరేకమని చెప్పారు. అమరావతిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ కంటే తానే ఎక్కువ కాలం కాపురం చేశానని జగన్ చెప్పుకున్నారు. తనకు అమరావతిపై అభిమానం ఉందనేందుకు చంద్రబాబు కంటే ముందుగానే తాడేపల్లిలో సొంత ఇల్లు కట్టుకున్నానని.. ప్రస్తుతం అదే భూమిపై ఉండడమే సాక్ష్యమన్నారు. ఇలా అర్థంపర్థం లేని వ్యాఖ్యలు, వాదనలు జగన్ రాజకీయ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అతనిలోని నిరంకుశ విధానాలు బటయకు వస్తున్నాయి. అధికారంలో ఉంటే ఎంతటి విధ్వంసానికి అయినా తెగిస్తారని ప్రజావేదిక కూల్చివేతతో చూపారు. మద్యపాన నిషేధం పేరుతో మద్యంపై దందా చేశారు. ఒక్కటేమిటి సకల వ్యవస్థలను భ్రష్టు పట్టించి, బటన్ నొక్కుడుతో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారు. అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారు. విశాఖ భీమిలిలో ప్యాలెస్‌లు కట్టుకుని తన రాజరిక పోకడలను చాటారు. అందుకే ఇప్పుడు జగన్ తననకున్న కాస్తా ఇమేజ్‌ను బజారున పడేసుకున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించడం ద్వారా వైసీపీతో పాటు జగన్ జాతీయ రాజకీయాల్లో భ్రష్ట చరిత్రను లిఖించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి సంబంధించిన బిల్లును.. వైసీపీ తప్ప అన్ని పార్టీలూ సంపూర్ణంగా సమర్థించాయి. బిల్లును వ్యతిరేకించొద్దు.. మద్దతు ఇవ్వొద్దన్నది తొలుత వైసీపీ తీసుకున్న నిర్ణయం. అయితే కాంగ్రెస్ తెలంగాణ ఎంపీలు సైతం అమరావతికి మద్దతిస్తూ మాట్లాడడంతో వైసీపీ నాయకత్వానికి దిక్కుతోచలేదు. చివరకు వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును విమర్శిస్తూ వైసీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని గానీ.. ఆ పార్టీ ఎంపీల వాకౌట్‌ను గానీ సభలో ఎవరూ పట్టించుకోలేదు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగుస్తున్న వేళ, అకస్మాత్తుగా బిల్లును తెరపైకి తేవడం.. దానికి ముందే అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి పంపాలని స్వయంగా ప్రధాని కార్యాలయం రాష్ట్రప్రభుత్వానికి సూచించడం.. ఆగమేఘాలపై కూటమి ప్రభుత్వం అత్యవసరంగా అసెంబ్లీని సమావేశపరచి తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం.. శాసనమండలిలో పెట్టనవసరం లేదని తేల్చడం.. ఆ వెంటనే కేంద్రం బిల్లును తీసుకు రావడం.. శరవేగంతో జరిగిన ఈ పరిణామాలతో జగన్ ఉక్కిరిబిక్కిరి అయ్యారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఓవైపు మతపరమైన, కుటుంబపరమైన వివాదాలు జగన్‌ని చుట్టుముడుతున్న వేళ, ఇప్పుడు అమరావతితో రాజకీయంగా సమాధి తవ్వుకున్నట్లుగానే భావించాలి. వర్తమాన రాజకీయాలలో జగన్ తనవికృత రాజకీయ మేథను ప్రదర్శించి మరొకరు సాటిరారని ప్రచారం చేసుకున్నారు. ఇలాంటి రాజకీయ నేతల వల్ల ప్రజలకు కానీ, రాష్ట్రానికి కానీ మేలు జరగదు. ఫక్తు ఫూడల్ వ్యవస్థకు పునాదిగా జగన్ రాజకీయ ఆలోచనలు అద్దం పడుతున్నాయి.

# 20వ వార్డులో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక





## మరో వార్డులో మొక్కుబడి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**దేవరకొండ ఏప్రిల్ 2( మహాప్రభ**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ “ ప్రజాపాలన ప్రగతి” ప్రణాళిక లో భాగంగా గురువారం స్థానిక 20వ వార్డులో దేవరకొండ మునిసిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు వార్డు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ పూర్ణచందర్రావు హాజరు కాగా చైర్ పర్సన్ మాట్లాడుతూ వార్డులోనే మంచినీరు, విద్యుత్తు, పారిశుద్ధం పనితీరుపై ప్రజలను అడిగి తెలుసుకుని అధికారులు దృష్టికి తెలియపరచడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఏఈ, సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, వార్డ్ ఆఫీసర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు మహిళలు పాల్గొని తమ విన్నపములను తెలియపరిచారు. రెండవ వార్డులో మున్సిపల్ కౌన్సిలర్ పొట్ట మురళి ఆధ్వర్యంలో అనేకమంది మహిళలు ప్రజలు వైద్య సిబ్బంది మున్సిపల్ సిబ్బంది వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను వార్డు కౌన్సిలర్ తానే స్వయంగా గమనించి వార్డులోని సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సహకరిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు, వైద్య సిబ్బంది భవాని, అంగన్వాడి టీచర్ పద్మ, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు. 17వ వార్డులో నిర్వహించిన “ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో వార్డు కౌన్సిలర్ పొట్ట మధు పాల్గొని ప్రజల వద్ద నుండి వచ్చిన సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. వార్డులో త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధం పని తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది ప్రజలు విద్యుత్తు జీరో బిల్లు రావటం లేదని కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది, ఈ విషయాన్ని అధికారులతో మాట్లాడి సరి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ స్కూల్ ఉపాధ్యాయిని శోభ, అంగన్వాడి టీచర్ బాలమని, మున్సిపల్ సిబ్బంది, మహిళలు ప్రజలు పాల్గొన్నారు. మరికొన్ని వార్డులలో ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ శాఖ అధికారులు వార్డు సభలను నామమాత్రంగా నిర్వహించడం ప్రజలలో చర్చనీయమైంది. కొన్ని వాటిల్లో ప్రజాప్రతినిధులు. అధికారులు లేకుండానే వార్డు సభలను మొక్కుబడిగా నిర్వహిస్తూ అర్ధాంతరంగా ముగించారు. గ్రామ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడమే ప్రభుత్వ ఉద్యోగం అని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించినప్పటికీ అట్టి వాటిని లెక్కచేయకుండా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు

# ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక కార్యక్రమాలు





**తాడ్వాయి, ఏప్రిల్ 2: (మహాప్రభ)**

ప్రజ పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా తాడ్వాయి మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం గ్రామ సభలను విస్తృతంగా నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ సమావేశాలు వేదికగా మారాయి.గ్రామ సభల్లో గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల మెరుగుదలపై చర్చించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులు స్వీకరించి, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి రఘునందన్, ఎంఆర్వో శ్వేత, ఎంపీడీఓ సవిత రెడ్డి, పాల్గొని ప్రభుత్వ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై వివరించారు. అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

# జనాభా గణన పై ఆర్డీవో సమీక్ష

**దేవరకొండ ఏప్రిల్ 2( మహాప్రభ )**



దేవరకొండ డివిజన్లో ప్రభుత్వం చేపట్టిన జనాభా గణన పై ఆర్డీవో రమణా రెడ్డి గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ గ్రామాల వారిగా కుటుంబ సభ్యుల వివరాలను పక్కగా నమోదు చేయాలని తెలిపారు. ఏవైనా రెండు గ్రామాల వివరాలను విలీనం చేయకూడదని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, నిబంధనల ప్రకారం గణన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను సూచించారు

# మర్రిగూడలో గడ్డి ట్రాక్టర్ పల్టీ

## ఒకరికి తీవ్ర గాయాలు

**మర్రిగూడ, ఏప్రిల్ 2( మహాప్రభ )**

మర్రిగూడ మండల కేంద్రంలోని చౌరస్తాలో గడ్డితోడుతో వస్తున్న ట్రాక్టర్ అతివేగంగా నడపడంతో పల్టీ కొట్టి ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కొండూరు గ్రామానికి చెందిన జేసీబీ యాజమాని దండుగుల కృష్ణపై గడ్డి కట్టలు పడటంతో కాళ్లు, చేతులు విరిగాయి. స్థానికులు అతన్ని వెంటనే హైదరాబాద్‌కు తరలించారు.ట్రాక్టర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధునిక డిజిటల్ సదుపాయాలు ఏర్పాటు






**కామారెడ్డి, ఏప్రిల్ 2 (మహాప్రభ):**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధునిక డిజిటల్ సదుపాయాల ఏర్పాటు దిశగా మరో ముందడుగు పడింది. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చేతుల మీదుగా టీవీ ప్యానెల్‌లను ప్రారంభించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో రామ్ కీ ఫౌండేషన్ 'పరివర్తన' ప్రాజెక్టు కింద కళాశాల విద్యార్థుల డిజిటల్ శిక్షణ అభివృద్ధికి రెండు 75 సెంటీమీటర్ల టీవీలను కళాశాలకు అందజేశారు. ఈ సదుపాయాల కల్పనలో కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపారు. ఇదే కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మొత్తం 40 టీవీలను పంపిణీ చేశారు. అదనంగా ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ఆధ్వర్యంలో మరో 80 టీవీ ప్యానెల్‌లను కూడా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల డిజిటల్ నైపుణ్యాల పెంపొందనకు ఈ సదుపాయాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విద్యాభ్యాసం మరింత ప్రభావవంతంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, డిప్యూటీ ఎమ్మార్వో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ నరేష్ గౌడ్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతిప్రాణాలిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా గ్రామ సభలు

**శివంపేట, ఏప్రిల్ 2: (మహాప్రభ)**




ప్రజ పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శివంపేట మండలంలోని చిన్న గొట్టిముక్కల, శివంపేట, కొంతానుపల్లి, చండి, మొదలగు అన్ని గ్రామాలలో గురువారం గ్రామ సభలను విస్తృతంగా నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ సమావేశాలు వేదికగా మారాయి.గ్రామ సభల్లో గ్రామ అభివృద్ధి, ఇందిరమ్మ ఇల్లు, ఉచిత విద్యుత్తు , రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల మెరుగుదలపై చర్చించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులు స్వీకరించి, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

# రామంపేటలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు





**రామాయంపేట ఏప్రిల్ 2 మహాప్రభ**
రామాయంపేట పట్టణంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణం కేంద్రంలోని మటన్ గడ్డ ప్రాంతంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం రామయంపేట పట్టణంలోని బీసీ కాలనీ ప్రాంతం నుండి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ ఎత్తున శోభయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ శోభాయాత్రలో భక్తులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని శోభయాత్రను ఘనంగా నిర్వహించారు

# సందడిగా...గ్రామసభ



**పాపన్నపేట ఏప్రిల్ 2 ( మహా ప్రభ ):**
గురువారం కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో గ్రామసభ నిర్వహించారు. వివిధ శాఖాధికారులు గ్రామ పెద్దలు హాజరయ్యారు స్పెషల్ ఆఫీసర్ గా డిప్యూటీ MRO ప్రగతి నివేదికను చదివి గ్రామ ప్రజలకు వివరించారు. గ్రామభివృద్ధికీ ప్రజలు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ పద్మా జగన్, ఉప సర్పంచ్ రాము, పాలక మండలి తదితరులు పాల్గొన్నారు

# దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో గ్రామసభల నిర్వహణ...



**దుబ్బాక – ఏప్రిల్ 02 (మహాప్రభ)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన " ప్రజాపాలనా – ప్రగతి ప్రణాళిక " 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం దుబ్బాక మున్సిపాలిటీలోని 20వ వార్డులో వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల అభిప్రాయాలను అధికారులు తెలుసుకున్నారు . వార్డులోని సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దుబ్బాక మున్సిపాలిటీలోని 4 ,5 ,12 ,14 ,16 ,16 ,20 వ వార్డులో నిర్వహించిన గ్రామసభలో ప్రత్యేక అధికారికంగా డిఆర్ఓ నాగరాజమ్మ పాల్గొని, గ్రామ సభలను పర్యవేక్షించారు. ప్రజల నుంచి ఆర్జీల రూపంలో పలు వినతులను స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజా సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వము గ్రామసభలను నిర్వహిస్తోందని ప్రజలందరూ అధిక సంఖ్యలో గ్రామసభలో పాల్గొని, వారి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ రమేష్ కుమార్ వార్డ్ కౌన్సిలర్లు అధికం బాలకిషన్, కోలా నిరోష, బండి శ్రీలేఖ, తునికి సురేష్ , దేవుని రాజు, ఐరని అఖిల, వార్డు అధికారులు ఆయా శాఖల అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బస్సును ఢీకొని యువకుడి దుర్మరణం

**అల్లగడ్డ ఏప్రిల్ 02 (మహాప్రభ)**
ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని శిరివెళ్ల మండలం గోవిందపల్లె వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాలి ప్రవీణ్ (25) అనే యువకుడు మృతి చెందాడు. నంద్యాల నుంచి ఎర్రగుంట్లకు బైక్పై వెళ్తుండగా ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడు గుండంపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం

**- రాంశెట్టి హర్షిత**





**కామారెడ్డి ఏప్రిల్ 02(మహాప్రభ)**
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలులో ముందజులో ఉందని కామారెడ్డి 14వ వార్డ్ కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత తెలిపారు. ఎన్జీవోస్ కాలనీలో శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం కమ్యూనిటీ హాల్ లో 14వ వార్డ్ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 14వ వార్డ్ కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత మాట్లాడుతూ... 99 రోజుల పాటు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. 5 దశల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వంటివి క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. మార్చి 6 నుండి జూన్ 12 వరకు 5 దశల్లో కార్యక్రమాలు, పరిసరాల పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారం చేపట్టనునట్లు తెలిపారు. 14వ వార్డ్ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కారంకు చర్యలు చెప్పడతామని తెలిపారు. అధికారులు శానిటేషన్ సమస్యపై దృష్టి పెట్టాలని, దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు తీసుకోవాలని సూచించారు. డిగ్రీ కళాశాల నుంచి వచ్చే వర్షం నీరు కాలనీలోకి రాకుండా జిల్లా కలెక్టర్, ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ స్పెషల్ ఆఫీసర్ మహాలక్ష్మి, వార్డ్ ఆఫీసర్ వినీత్, డీసీసీ ఉపాధ్యక్షులు సబ్బని కృష్ణ హరి, వార్డ్ ప్రతినిధులు శర్మ, పూర్ణచందర్ రావ్, గంగారాం, కృష్ణరెడ్డి, సిద్ధిరెడ్డి, రమేష్ గుప్తా, సిద్దిరామ్ రెడ్డి, ప్రభాకర్, దేవేందర్, కిరణ్ మున్సిపల్, ట్రాన్స్ కో, శానిటేషన్, వాటర్ వర్క్స్ తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు యువతకు ఆదర్శం

**అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్ జిల్లా -02ఏప్రిల్ (మహాప్రభ)**
కలం, సామాజిక సమానత్వం, న్యాయం కోసం పోరాడిన వీర యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతివేడుకల్లో అదనపు కలెక్టర్ నగేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అణచివేతకు వ్యతిరేకంగా పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మంగా రమేష్ గౌడ్, రేణుక ఎల్లమ్మ ఆలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ విద్యాధర్ గౌడ్, సంఘ నాయకులు నర్సింహులు గౌడ్, సురేందర్ గౌడ్, నాగరాజు గౌడ్, యాదగిరి గౌడ్, శంకర్ గౌడ్, కుమార్ గౌడ్ సహాయ వెనుక బడిన తరగతుల అభివృద్ధి అధికారి గంగా కిషన్, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్,లవన్, భాను ప్రకాష్,ఆరీఫ్, నర్సింహులు,సిద్దరాములు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సందడిగా.. గ్రామసభ



**గాంధారి ఏప్రిల్ 2 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో గురువారం గ్రామసభల్లో విస్తృతంగా నిర్వహించారు. గ్రామ సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించారు. గ్రామ సభలు గ్రామ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు మౌలిక సదుపాయాలు మెరుగుదలపై చర్చించారు. గ్రామ ప్రజలు నుంచి వచ్చిన వినతులను అధికారులకు స్వీకరించి తక్షణమే పరిశీలించాలని చర్యలు తీసుకోవాలని అధికారులకు స్థానిక సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్, అన్నారు. ప్రజాపాలన గ్రామ సభ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గాంధారి మండల ప్రత్యేక అధికారి డిఆర్డిఓ సురేందర్, తాసిల్దార్ రేణుక చౌహాన్, గ్రామ ఉపసర్పంచ్ భాస్కర్ గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఐకెపి సీసీ గౌర్రె రాములు, గ్రామ సంఘాల వివోఏలు, గ్రామ పాలకవర్గం అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్

**- 31 మందికి శిక్షలు, నలుగురికి జైలు**
**-క్షణికానందం.. కుటుంబానికి తీరని శోకం: జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఐపిఎస్ ,**
**-నిర్లక్ష్యం వీడండి -- సురక్షితంగా ఇంటికి చేరండి**



**కామారెడ్డి మార్చ్ 02(మహాప్రభ)**
జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ చేపట్టిన చర్యల్లో భాగంగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 31 మందికి న్యాయస్థానం శిక్షలు ఖరారు చేసింది. ఇందులో నలుగురికి జైలు శిక్ష పడగా, అందరికీ కలిపి 34,000/– జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు అనేవి విధి రాత కాదని, మనం చేసే చిన్న నిర్లక్ష్యం వల్లే సంభవిస్తాయని స్పష్టం చేశారు. ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా, మానసికంగా రోడ్డున పడుతుందని, మద్యం మత్తులో స్టీరింగ్ పట్టడం అంటే ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని ఆయన హెచ్చరించారు. మీ కుటుంబ క్షేమం కోసం నిబంధనలు పాటించాలని, చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# చందంపేటలో శ్రీసాయి కాటన్ ఇండస్ట్రీకి భూమి పూజ:

**పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్**



**దేవరకొండ ఏప్రిల్ 2 ( మహాసభ )**
దేవరకొండ నియోజకవర్గం లోని, చందంపేట మండలం గన్నెర్లపల్లి గెట్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీసాయి కాటన్ ఇండస్ట్రియల్ నిర్మాణం భూమి పూజ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మారుమూల ప్రాంతంలో కాటన్ మిల్ ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఆయన అన్నారు. పత్తి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ౧ఎచీ రెడ్డి , కేతావత్ శంకర్ నాయక్, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు ఉన్నారు.

# మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత,

**-శాసనసభ్యులు : నేనావత్ బాలునాయక్**



**దేవరకొండ ఏప్రిల్ 2( మహాప్రభ )**
దేవరకొండ మండలంలోని వద్యా తండా లో NREGS నిధుల నుంచి మంజూరైన రూ. 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న మహిళా సమాఖ్య సంఘ భవనం నిర్మాణ పనులకు శాసనసభ్యులు నేనావత్ బాల నాయక్ గురువారం శంకుస్థాపన చేశారు, మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, అధికారులు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు

# ప్రతి వాహదారుడు హెల్మెట్ తప్పనిసరి

**–బొడగుట్ట తండాలో అవగాహన ర్యాలీ**




**మహబూబాబాద్, ఏప్రిల్ 2( మహాప్రభ )**
మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొడగుట్ట తండా గ్రామంలో గురువారం హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ దీపిక, సర్పంచ్ వీరన్న, గ్రామ ప్రజలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ప్రజలకు సూచించారు.


## పవనపుత్రుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ, సంతోషాలతో ఉండాలి ఎమ్మెల్యే

-మెదక్ జిల్లా కేంద్రంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు
-హనుమాన్ జయంతి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. ఎమ్మెల్యే
-అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే
-హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు..



**మెదక్ జిల్లా -02ఏప్రిల్ (మహాప్రభ )**
మెదక్ పట్టణంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పాల్గొన్నారు హనుమాన్ భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తి భావాన్ని చాటారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు స్వయంగా ఎమ్మెల్యే వడ్డించారు రామభక్త హనుమా ,జై హనుమాన్ జై జై హనుమాన్ అనే నినాదాలతో మెదక్ పట్టణ పురవీధులు హనుమాన్ భక్తుల భక్తి పారవశ్యంతో మారుమోగాయి. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ శ్రీ హనుమంతుడు భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీక. హనుమాన్ జయంతి అంటే మనసుకు, శరీరానికి శక్తి, ధైర్యం, నిబద్ధతను ఇచ్చే పర్వదినం అని అభివర్ణించారు.. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే గుణానికి ఆంజనేయుడే నిదర్శనం. అని అన్నారు. హనుమాన్ జయంతిని అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, పవనపుత్రుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ, సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ నరేష్, ప్రజా ప్రతినిధులు హనుమాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం పద్మ దేవేందర్ రెడ్డి..



**మెదక్ జిల్లా -02ఏప్రిల్ (మహాప్రభ )**
ఏడుపాయల దేవస్థానం మాజీ ధర్మకర్త ఉప్పరి. వెంకటేశం కూతురు నందిని సతీష్ సాగర్ ల వివాహం పాపన్నపేట మండల కేంద్రంలోని మంజీరా గార్డెన్ ఘనంగా జరిగింది. ఈ వివాహానికి మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మాదేవేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈసందర్భంగా వారి దాంపత్య జీవితం సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షించారు. వీరి వెంట మెదక్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ మల్లికార్జున్ గౌడ్,మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి,మాజీ సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు జగన్, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్,లింగారెడ్డి,శ్రీనాథ్ రావు,నాయకులు సోములు, సుంకరి. కృష్ణ, దుర్గయ్య, అనిల్ రెడ్డి,వెంకట్ రెడ్డి. నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన సౌకర్యాలను పరిశీలించిన గ్రామ సర్పంచ్



**శివంపేట ఏప్రిల్ 2 (మహాప్రభ):** శివంపేట మండల పరిధి దంతాన్పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన సౌకర్యాలను సర్పంచ్ గజేంద్రుల మమత పరిశీలించారు. ఈ సందర్భంగా వంటగదిని తనిఖీ చేసి, భోజన నాణ్యత మరియు పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థులకు రుచికరమైన, పోషకాహారంతో కూడిన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నిమ్మల రవి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూను కచ్చితంగా అమలు చేయాలని సర్పంచ్ మమత స్పష్టం చేశారు.

## దేవరకొండలో వైభవంగా హనుమాన్ జయంతి

– శోభాయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ ఏప్రిల్ 2( మహాప్రభ )**
అచంచలమైన భక్తి, అపారమైన శక్తి, అజేయమైన ధైర్యానికి ప్రతీకగా ప్రతి హృదయంలో వెలుగొందే భగవాన్ శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా నేడు దేవరకొండ పట్టణంలోని శివాలయం వద్ద నుండి నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్.ప్రతి ఒక్కరూ హనుమంతుడిలా ధైర్యసాహసాలతో, నిస్వార్థ సేవాభావంతో, అపార సహనంతో జీవించాలని, మనిషిలోని భయాలను జయించి, సత్యం, ధర్మమార్గంలో ముందుకు సాగేందుకు హనుమంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ దేవరకొండ ప్రాంత ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్,పట్టణ కౌన్సిలర్లు హన్మంతు సాయి చంద్ర, కన్యశ్రీ సేవ్య నాయక్,అడ్వకేట్ ఉమామహేశ్వర్. సీనియర్ బిజెపి నాయకులు వస్కు ల సుధాకర్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు

# ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు వార్డు,గ్రామ సభలు

-ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ప్రభుత్వ అభివృద్ధి పై అవగాహనతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారం.
-మెదక్ శాసన సభ్యులు డా:మైనంపల్లి రోహిత్ రావు.



**మెదక్ జిల్లా -02ఏప్రిల్ (మహాప్రభ )**
ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు ప్రారంభమయ్యాయి. గురువారం మెదక్ పట్టణంలోని దయరా 16,17 వార్డుల్లో, వార్డు సభల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు అనంతరం మెదక్ మండలం ముత్తాయి కోట, హవేలీ ఘనపూర్ మండలం నిర్వహించిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. మెదక్ శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ . ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకే గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు. తెలిపారు.గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక సందర్భంగా గత రెండు సంవత్సరాలలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్దిని ప్రజలకు వివరిస్తూ ప్రజల సమస్యలను తీర్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు.
మున్సిపాలిటీలతోపాటు గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మించామని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంస్థలను, సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత విద్యుత్, 500 రూపాయలకే సిలిండర్ ,సన్న బియ్యం, తదితర పథకాలను 6 గ్యారంటీలను అమలు చేస్తున్నదని తెలిపారు. ఇంకా చాలామంది అర్హులైన వారికి రేషన్ కార్డులు రావాల్సి ఉందని, వాటిని కూడా ప్రభుత్వం మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక లో భాగంగా మార్చి 6న ప్రారంభమైన కార్యక్రమం మార్చి 15 వరకు పరిశుభ్రత, ఫైళ్ల క్లియరెన్స్ జరిగిందని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో వివిధ పథకాల కింద లబ్దిదారుల వివరాలను సేకరించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి పథకం ,మహిళకు ఉచిత బస్సు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ వంటివి ఇదివరకే ఇవ్వడం జరిగిందని తెలిపారు. నూతన పథకాల లో భాగంగా పాఠశాల, ఇంటర్ విద్యార్థులకు అల్పాహారం, అన్ని వర్గాల ప్రజలకు జీవిత బీమా పథకం, దివ్యాంగులకు మోటారు బ్యాటరీ సైకిళ్లు, రైతులకు మేలైన వంగడాలు ఇస్తున్నామని, ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక సందర్భంగా నిర్వహిస్తున్న గ్రామసభలలో ఆయా పథకాల కింద లబ్ది పొందిన లబ్ధిదారుల వివరాలన్నిటిని చదివి వినిపించడమే గాక, గ్రామంలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతున్నదని వెల్లడించారు .అంతకుముందు గ్రామలలో సర్పంచ్లు, మున్సిపాలి లలో మున్సిపల్ కమిషనర్లు అధ్యక్షతన గ్రామసభను,మున్సిపల్ వార్డు ప్రారంభించి రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్, వార్డు మెంబర్లు ,గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, తదితరులు హాజరయ్యారు.

## ఈనెల 13న సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం

# ముందు ధర్నాను జయప్రదం చేయండి

- వికలాంగుల పెన్షన్ 6000 కు పెంచాలి...!
- ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు చేయాలి...
-వికలాంగుల హక్కులను తుంగలో తొక్కుతున్న కేంద్ర ప్రభుత్వం
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశీ, అడివయ్య



**దుబ్బాక - ఏప్రిల్ 02 (మహాప్రభ)**
వికలాంగుల హక్కుల జాతీయ వేదిక దుబ్బాక నియోజకవర్గం కార్యకర్తల సమావేశం దుబ్బాక పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఎన్ పి ఆర్ డి జిల్లా అధ్యక్షులు ఎం, సాజీద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎన్ పి ఆర్ రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యశీ, అడివయ్య హాజరై మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వికలాంగుల సంక్షేమానికి నిధుల కేటాయింపులో తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించిందని, ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన 3, 24, ,234 కోట్ల బడ్జెట్లో వికలాంగుల సంక్షేమానికి 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం 5 శాతం నిధులు కేటాయించాలి, కానీ బడ్జెట్ కేటాయింపుల్లో వికలాంగుల సంక్షేమ శాఖను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. 2025-26 బడ్జెట్లో 77 కోట్లు కేటాయించిన ప్రభుత్వం 2026 - 27 బడ్జెట్లో 14,628,91 కోట్లు కేటాయిస్తే 2026 -27 బడ్జెట్లో 14,861 కోట్లు కేటాయించారు. 2023 డిసెంబర్లో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలో చేయూత పెన్షన్ కోసం 24.85 లక్షల మంది దరఖాస్తులు చేసుకుంటే బడ్జెట్లో 232.09 కోట్లు అదనంగా కేటాయించిన ప్రభుత్వం అర్హులైన రెండు లక్షల మందికి కొత్తగా పెన్షన్ మంజూరు చేస్తామని ప్రకటించడం అంటే చేయూత లబ్ధిదారులను మోసం చేయడమే అవుతుందని, పుట్టుకతో వచ్చి వైకల్యాలను గుర్తించి స్వస్థత అంగవైకల్యంగా మారకుండా నివారించడానికి ప్రకటించిన బాల భరోసా పథకానికి బడ్జెట్లో నిధులు కేటాయించకుండా పథకాన్ని ఏ విధంగా అమలు చేస్తారని ప్రశ్నించారు. వికలాంగులకు సహాయ పరికరాల కొనుగోలు కోసం బడ్జెట్లో నిధులు కేటాయించలేదు, బడ్జెట్లో స్పెషల్ ఎడ్యుకేషన్ అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించిందని ఇంటర్మీడియట్ చదువుతున్న వికలాంగులకు రెట్రోఫిట్టెడ్ మొట్టరాయుడు వాహనాలను అందించాలని బడ్జెట్లో ప్రస్తావించిన ప్రభుత్వం, నిధులు మాత్రం కేటాయించలేదన్నారు 2016 ఆర్ పి డి చట్టంతో పాటు నేషనల్ ట్రస్టు, నేషనల్ పాలసీ, 2017 హెల్త్ కేర్ యాక్ట్ వంటి చట్టాలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్వీయశీ చేస్తుందని అన్నారు. ఎన్ పీ ఆర్ డి జిల్లా గౌరవ అధ్యక్షులు జి భాస్కర్ జిల్లా అధ్యక్షులు ఎండి సాజీద్ మాట్లాడుతూ.... జిల్లాలో వికలాంగులకు పంపిణీ చేయాల్సిన సహాయ పరికరాలు పంపిణీ చేయడం లేదని అన్నారు. స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తులు చేసిన వారికి రుణాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో 5% వికలాంగులకు కేటాయించాలని జీవో ఉన్న ఎందుకు అమలు చేయడం లేదని అన్నారు. మోటార్ బైకులు జిల్లాలో వికలాంగులకు పంపిణీ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో ఉన్న వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 13న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ధర్నాకు జిల్లాలోని వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ పి ఆర్ డి దుబ్బాక డివిజన్ నాయకులు వి, యాదయ్య వజ్జల రాజేశ్వర్, షాదుల్, లక్ష్మి,నరసయ్య,కాల్వ రమేష్, శెట్టి నరసింహులు,బిట్ల బాబు, టి,ఎల్లయ్య, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.


## లలితపల్లిలో పశువులకు గాలికుంటు టీకా

95 పశువులకు టీకా వేసిన అధికారులు



**ఎలిగేడు, ఏప్రిల్ 2( మహాప్రభ )**
ఎలిగేడు అనుబంధ గ్రామమైన లలితపల్లెలో గురువారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు వులకు గాలికుంటు నివారణ టీకా వేశారు.గ్రామంలో మొత్తం 95 పశు వులకు టీకా వేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి ఝాన్సీ సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉపసర్పంచ్ ముంజం నరేష్, వార్డు సభ్యులు మడుపు నరేందర్, కాంపెల్లి సాయి ప్రశాంత్, గుండేటి మురళి, వెటర్నరీ అసిస్టెంట్ శంకర్, గోపాలమిత్ర పెద్ది సమ్మయ్య, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

# మహిళ అదృశ్యం



**అల్లగడ్డ ఏప్రిల్ 2( మహాప్రభ )**
ఆళ్లగడ్డ మండలం ఎస్. లింగందిన్నెకు చెందిన తలారి లక్ష్మీదేవి(40) అదృశ్యమైన కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై వరప్రసాద్ తెలిపారు. గత నెల 27న ఆసుపత్రికి వెళ్తానని ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 9121101167, 9121101166 సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## కొండగట్టుకు బయలుదేరిన హనుమాన్ భక్తులు



**ఎలిగేడు, ఏప్రిల్ 2( మహాప్రభ )**
హనుమాన్ జయంతి సందర్భంగా ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన భక్తులు గురువారం కొండగట్టుకు బయలుదేరారు. 21 రోజులు హనుమాన్ మాల వేసి భక్తి భజనలో ఆధ్యాత్మికంగా గడిపిన భక్తులు ఇరుముడి కట్టుకొని మాల విరమణ అనంతరం అంజన్న స్వామి దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సకాలంలో పండాలని హనుమాన్ భక్తులు ప్రార్థించారు.

# బిజినెస్


## నష్టాల్లో ప్రారంభమై లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. బలపడ్డ రూపాయి



భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన మార్కెట్లు క్లోజింగ్ సమయానికి కాస్త పుంజుకుని, స్వల్ప లాభాలతో ముగిశాయి. ఉదయం ఒక దశలో ఏకంగా రూ.10 లక్షల కోట్లు మార్కెట్ నష్టపోయింది. ఇరాన్‌కు ట్రంప్ చేసిన హెచ్చరికలు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఉదయం 72,262.05 పాయింట్ల వద్ద భారీ నష్టంతో ప్రారంభమైంది.అంతకుముందు రోజు మార్కెట్ 73,134.32 వద్ద ముగిసింది. అంటే దాదాపు 900 పాయింట్ల నష్టంతో గురువారం ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో ఇంకా నష్టపోయి ఏకంగా 71,545.81 స్థాయికి పడిపోయింది. ఆ తర్వాత నెమ్మదిగా కోలుకున్న సెన్సెక్స్ ట్రేడింగ్ ముగిసే సమయానికి 185.23 పాయింట్ల (0.25 శాతం) లాభంతో 73,319 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 కూడా ఒక దశలో 496 పాయింట్లు నష్టపోయింది. తర్వాత 33.70 పాయింట్లు (0.15 శాతం) కోలుకుని 22,713 వద్ద ముగిసింది. ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్, యుద్ధం ముగియడానికి రెండు వారాలు సమయం పడుతుందని ప్రకటన చేయడంతో మార్కెట్లో అనిశ్చితి నెలకొంది. దీంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడ్డారు. ఆర్బీఐ తాజా రూల్స్ నేపథ్యంలో బ్యాంకింగ్ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఈ కారణాలన్నింటి వల్ల మార్కెట్ నష్టాలకు గురైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, యాక్సిస్, ఎస్బీఐ బ్యాంకులు, లార్సెన్ అండ్ టర్బో, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా వంటి సంస్థలు భారీగా నష్టపోయాయి. మరోవైపు రూపాయి విలువ బలపడింది. డాలర్‌తో మారకం విలువ 157 పైసలు కోలుకుని 93.13 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 108 డాలర్లకు చేరింది. అలాగే, ఔన్స్ బంగారం ధర 4616 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# మళ్లీ పుంజుకున్న బంగారం ధరలు..

గత కొన్ని రోజులుగా భారీగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే బంగారం, వెండి ధరలు మళ్లీ పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్ విలువ తగ్గడం వల్ల పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గు చూపడంతో బంగారం ధరల్లో ఒక్కసారిగా భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. డాలర్ తగ్గితే సాధారణంగా బంగారం ధరలు పెరుగుతాయి. ఈ క్రమంలో బుధవారం ఒక్కరోజే తులం బంగారంపై ఏకంగా రూ.3వేలకుపైగా పెరిగింది. ఈ భారీ హెచ్చుతగ్గుల తర్వాత ప్రస్తుతం భారత్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు సుమారు రూ.1,52,960 కు చేరుకుంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర చూసుకుంటే తులం 1,40,200 వద్ద స్థిరపడింది. ఇక 18 క్యారెట్ల బంగారం ధర రూ. 1,14,710 కొనసాగుతోంది. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో



బంగారం, వెండి ధరలు ఇలా గురువారం ఉదయం 6గంటలకు హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,960గా ఉంది. నిన్న ఈ ధర రూ.1,52,950 వద్ద కొనసాగుతోంది. అటు 22 క్యారెట్ల ధర ఇవాళ రూ.1,40,210 వద్ద ఉండగా.. నిన్న రూ.1,40,200 వద్ద ట్రేడవుతోంది.

ఇక ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,52,960 వద్ద ట్రేడవుతోండగా.. నిన్న రూ.1,52,950గా ఉంది. ఇక 22 క్యారెట్ల రేటు రూ.1,40,210 వద్ద కొనసాగుతోంది. ఇక బెంగళూరులో 10 గ్రాముల 24 క్యారెట్ల ప్యూర్ బంగారం ధర రూ.1,52,960 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ ధర రూ.1,52,950గా ఉంది. అటు 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,40,210గా ఉండగా.. నిన్న రూ.1,40,200గా ఉంది. అటు చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,280గా ఉండగా.. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,40,510 వద్ద ట్రేడవుతుండగా..
ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,53,110 వద్ద కొనసాగుతుండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,40,360 వద్ద ట్రేడవుతోంది.

# పవర్ గ్రిడ్ నూతన సిఎండిగా వంశీ రామమోహన్

గూర్‌గావ్
ప్రభుత్వ రంగ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ దిగ్గజ కంపెనీ పవర్‌గ్రిడ్ నూతన ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి)గా వంశీ రామమోహన్ బుర్రా బాధ్యతల స్వీకరించారు. గతంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్)గా పనిచేసిన ఆయనకు పవర్ ట్రాన్స్‌మిషన్, టెలికాం రంగాల్లో 33 ఏళ్లకు పైగా విశేష అనుభవం ఉంది. 1993లో పవర్‌గ్రిడ్‌లో చేరిన వంశీ రామ మోహన్ సంస్థ నియంత్రణ వ్యూహాలను రూపొందించడంలో, టెలికాం వ్యాపార విస్తరణలో ఆయన కీలక పాత్ర పోషించారు. పవర్‌గ్రిడ్ ప్రయాణంలో మొదటి నుండి భాగస్వామిగా ఉన్న వంశీ రామమోహన్ నాయకత్వం, సంస్థను డిజిటల్, ఇంధన రంగాల్లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని ఆ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేశాయి



# అభిషేక్ శర్మ నంబర్ వన్

**-ఇషాన్ కిషన్ నంబర్ టూ**
**-టాప్ పది స్థానల్లో నలుగురు భారతీయులు !**
**-ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ విడుదల..**


అంతర్జాతీయ క్రికెట్ మండలి టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. టాప్ రెండు స్థానాలను భారత యువ సంచలనాలు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ కైవసం చేసుకున్నారు. అభిషేక్ శర్మ ఏకంగా 875 రేటింగ్ పాయింట్లతో నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకోగా.. అగ్రస్థానానికి కేవలం నాలుగు పాయింట్ల దూరంలో ఉన్న వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ 871 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత క్రికెట్ చరిత్రలో ఇలా ఇద్దరు ఆటగాళ్లు టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో వరుసగా తొలి రెండు స్థానాలను ఆక్రమించడం ఇదే తొలిసారి. టాప్ 10 స్థానంలో మొత్తం నలుగురు భారతీయులు ఉండటం మరో విశేషం. యువ సంచలనం తిలక్ వర్మ ఆరో స్థానంలో నిలవగా.. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఏడో స్థానంలో కొనసాగుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత ఆధిపత్యాన్ని స్పష్టం చేస్తున్నారు. టాప్ 20 బ్యాటర్ల



జాబితాలో ఇతర దేశాల ఆటగాళ్ల స్థానాల్లో స్వల్ప మార్పులు మాత్రమే చోటుచేసుకున్నాయి. ఇంగ్లండ్ వెటరన్ బ్యాటర్ జోస్ బట్లర్ ఒక స్థానం ఎగబాకి ఎనిమిదో ర్యాంకుకు చేరుకోగా, న్యూజిలాండ్‌కు చెందిన టిమ్ సీఫెర్ట్ ఒక స్థానం దిగజారి తొమ్మిదో ర్యాంకుతో సరిపెట్టుకున్నాడు. ఇటీవలే న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుతంగా రాణించి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కించుకున్న దక్షిణాఫ్రికా ఆటగాడు కోనర్ ఎస్టర్‌హుజెన్ తన ర్యాంకును అమాంతం మెరుగుపరుచుకున్నాడు. గతంలో టాప్ 100 వెలుపల ఉన్న అతను ఏకంగా 39వ స్థానానికి దూసుకురావడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అదే సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన కివీస్ ఆటగాడు టిమ్ రాబిన్సన్ 32వ స్థానానికి చేరుకున్నాడు. బౌలింగ్ విభాగం విషయానికి వస్తే ఆఫ్ఘనిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. భారత అగ్రశ్రేణి స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి రెండో స్థానంలో నిలవగా, స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఐదో ర్యాంకులో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా అగ్రస్థానంలో ఆధిపత్యం చెలాయిస్తుండగా.. భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రెండో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో విశేషంగా రాణించిన దక్షిణాఫ్రికా బౌలర్లు గెరాల్డ్ కోయెట్జీ, ఒట్నీల్ బార్ట్‌మాన్ లాంటి అద్భుత ఆటగాళ్లు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారీగా ఎగబాకారు. రానున్న ఇంగ్లండ్ సిరీస్‌కు ముందు టీమిండియా ఆటగాళ్లు మూడు విభాగాల్లోనూ సత్తా చాటుతుండటం భారత క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం నింపుతోంది.

# లక్నో స్టేడియంలో ఫ్యాన్స్ వీరంగం..

ఐపీఎల్ 2026లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఉత్కంఠభరితంగా సాగుతున్న మ్యాచ్‌ను చూసేందుకు వచ్చిన అభిమానుల మధ్య చిన్నపాటి వాగ్వాదం చివరకు పెద్ద గొడవకు దారితీసింది. స్టేడియం లోపలే అభిమానులు ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో దావానలంలా వ్యాపించాయి. ఘర్షణకు గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. గొడవ ముదరడంతో వెంటనే స్పందించిన పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను విడదీశారు. మ్యాచ్ విషయానికి వస్తే, మొదట బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో



కేవలం 141 పరుగులకే కుప్పకూలింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టును ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ తమ అద్భుత బ్యాటింగ్‌తో విజయతీరాలకు చేర్చారు. ఇంకా రెండు ఓవర్ల సమయం మిగిలి ఉండగానే ఢిల్లీ జట్టు విజయాన్ని అందుకుంది.

# స్పోర్ట్స్

## వైభవ్ సూర్యవంశీ భారీ రికార్డ్..



రాజస్థాన్ రాయల్స్ తరపున బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ, బలమైన చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్‌ను చీల్చి చెండాడాడు. కేవలం 17 బంతుల్లో 52 పరుగులు చేసిన ఈ యువ కెరటం, అందులో కేవలం 15 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తి చేసి ఐపీఎల్ రికార్డులను సమం చేశాడు. మైదానం నలుమూలలా అతను బాదిన షాట్లు చూస్తుంటే, ఒక అనుభవజ్ఞుడైన అంతర్జాతీయ ఆటగాడు ఆడుతున్నట్లు అనిపించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వైభవ్ అద్భుత ప్రదర్శన చూసిన పాకిస్థాన్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్, అతడిని వెంటనే భారత టీ20 జట్టులోకి తీసుకోవాలని సూచించాడు. ఇంత చిన్న వయస్సులో ఇంతటి పరిణతితో ఆడటం అసాధారణమని, ఐపీఎల్ ముగియగానే అతను టీమ్ ఇండియా నీలి రంగు జెర్సీలో కనిపిస్తాడని అక్మల్ జోస్యం చెప్పారు. సరిహద్దుల అవతల నుంచి కూడా వైభవ్ ప్రతిభకు ప్రశంసలు దక్కడం అతని సత్తాకు నిదర్శనం. వైభవ్ సూర్యవంశీలో ఉన్న అతిపెద్ద బలం అతని భయం లేని బ్యాటింగ్ శైలి. లక్ష్యం చిన్నదైనా, పెద్దదైనా ఏమాత్రం తడబడకుండా బౌలర్లపై విరుచుకుపడటమే ఇతని శైలి. యశస్వి జైస్వాల్‌తో కలిసి అతను అందించిన ఓపెనింగ్ భాగస్వామ్యం రాజస్థాన్ జట్టుకు సునాయాస విజయాన్ని అందించింది. కేవలం పరుగులు చేయడమే కాకుండా, మ్యాచ్ పరిస్థితులను బట్టి తన ఆటను మార్చుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బాసిత్ అలీ వైభవ్ ఆటతీరును సరదాగా ప్రశంసించారు. "ఈ ఒక్క బబ్లూ అందరికంటే భారంగా మారాడు" అంటూ వైభవ్ దూకుడును కొనియాడాడు. అనుభవజ్ఞులైన బౌలర్ల బంతులకు కూడా తన దగ్గర సమాధానం ఉందని వైభవ్ నిరూపించాడు. అతని షాట్ ఎంపిక, మైదానంలో చూపే తెగువ భారత క్రికెట్ భవిష్యత్తుకు శుభసూచకమని నిపుణులు అంటున్నారు. ఏదేమైనా, 15 ఏళ్లకే భారత జట్టులో చోటు సంపాదిస్తే, అది క్రికెట్ చరిత్రలోనే ఒక అద్భుత ఘట్టంగా నిలిచిపోతుంది.




# 'రామాయణ' నుంచి రాముడి గ్లింప్స్ విడుదల..

## రణబీర్ లుక్‌కు అదిరిపోయే స్పందన

బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' నుంచి తాజాగా కీలక అప్డేట్ వెలువడింది. దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రంలో రాముడిగా నటిస్తున్న రణబీర్ కపూర్‌కు సంబంధించిన గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నమిత్ మల్హోత్రా నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్‌తో ఆ అంచనాలు మరింత పెరిగాయి.ఈ గ్లింప్స్‌లో రణబీర్ కపూర్ రాముడిగా ఎంతో గంభీరంగా, శాంత స్వభావంతో కనిపిస్తున్నారు. సంప్రదాయ వేషధారణలో ఆయన లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా ఆయన ముఖంలో కనిపించిన ప్రశాంతత, ధైర్యం, దైవత్వం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. చిత్రంలో సీతగా సాయి పల్లవి నటిస్తుండగా, రావణుడిగా యశ్ కనిపించనున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. విజువల్స్, గ్రాఫిక్స్, నిర్మాణ విలువలు అంతర్జాతీయ స్థాయిలో ఉండనున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి భాగాన్ని 2026 దీపావళి సందర్భంగా విడుదల చేయాలని చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. ఈ చిత్రంతో భారతీయ ఇతిహాసమైన రామాయణాన్ని ప్రపంచ స్థాయిలో కొత్తగా పరిచయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు. దాదాపు ఈ చిత్రానికి 4వేల కోట్ల బడ్జెట్ కేటాయించినట్టు సమాచారం. తాజా గ్లింప్స్ విడుదలతో 'రామాయణం'పై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. రాబోయే రోజుల్లో టీజర్, ట్రైలర్ విడుదల చేసి ఈ చిత్రంపై మరింత హైప్ సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# 'డెకాయిట్' ట్రైలర్‌కు డేట్ ఫిక్స్..

## అంచనాలని పీక్స్‌కి తీసుకెళుతున్న అడివి శేష్




టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. షనీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రివెంజ్ డ్రామా, రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ మేళవింపుగా రూపొందుతోంది. కథ, ట్రీట్‌మెంట్ పరంగా కొత్తదనం చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు చిత్ర బృందం చెబుతోంది. ఈ చిత్రంలో శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్ నటించడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై మంచి బజ్‌ను సృష్టించాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 10, 2026న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఇక తాజాగా సినిమా ప్రమోషన్లలో భాగంగా అడివి శేష్ అభిమానులతో సోషల్ మీడియా ద్వారా ముచ్చటిస్తూ కీలక ప్రకటన చేశాడు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'డెకాయిట్' ట్రైలర్‌ను ఏప్రిల్ 4న విడుదల చేయనున్నట్లు ప్రకటించాడు. ఈ ట్రైలర్‌తో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరుగుతాయని మేకర్స్ ధీమాగా ఉన్నారు.ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుండగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. తెలుగుతో పాటు హిందీలో కూడా ఈ సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్, బాలీవుడ్ దర్శకుడు-నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రల్లో కనిపించనుండటం విశేషం. వారి పాత్రలు కథకు బలాన్ని అందించనున్నాయని టాక్ వినిపిస్తోంది. సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందిస్తుండగా, టెక్నికల్‌గా కూడా సినిమా ఉన్నత స్థాయిలో ఉండబోతోందని చిత్ర యూనిట్ చెబుతోంది. అడివి శేష్ తన కెరీర్‌లో ఎప్పుడూ కంటెంట్ ఆధారిత సినిమాలతోనే గుర్తింపు పొందాడు. ఇప్పుడు 'డెకాయిట్'తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంటాడా అన్న ఆసక్తి నెలకొంది. మొత్తానికి ట్రైలర్ రిలీజ్‌తో 'డెకాయిట్'పై ఉన్న హైప్ మరింత పెరగడం ఖాయం. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.


# వందో సినిమాలో పాతికేళ్ల యువకుడిగా?



అగ్ర నటుడు నాగార్జున తన ప్రతిష్ఠాత్మక వందవ చిత్రం షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. రా.కార్తీక్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా గురించి నాగార్జున కొన్ని ముఖ్యమైన విషయాలను వెల్లడించారు. ఇంకా ఈ సినిమా పేరును ఖరారు చేయలేదని, షూటింగ్ మాత్రం 45శాతం పూర్తయిందని నాగార్జున తెలిపారు. సున్నా నుంచి కోటీశ్వరుడిగా ఎదిగిన ఓ వ్యక్తి ప్రయాణాన్ని ఇందులో చూస్తారని, తండ్రీకూతుళ్ల అనుబంధం చుట్టూ ఈ సినిమా కథ నడుస్తుందని, ఇది పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్ అనీ నాగార్జున చెప్పారు. ఇదిలావుంటే.. ఈ సినిమాలో నాగార్జున పాతికేళ్ల నుంచి 60ఏండ్ల వరకూ రకరకాల వయసుల్లో కనిపిస్తారట. ముఖ్యంగా పాతికేళ్ల యువకుడిగా కనిపించేందుకు 'డీ-ఏజింగ్' టెక్నాలజీని వాడుతున్నట్టు తెలిసింది. అన్నపూర్ణ స్టూడియోస్ భారీ ఎత్తున నిర్మిస్తున్న ఈ చిత్రంలో టబు, సుస్మితా భట్, విజయేంద్ర కీలక పాత్రధారులు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలియరానున్నాయి.



# తెలుగులో తొలి ఎఐ చిత్రం... అంబ ద రివెంజ్



తెలుగు సినీ పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికే విధంగా.. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న తొలి ఫీచర్ ఫిల్మ్ 'అంబ' ద రివెంజ్' ప్రేక్షకుల ముందుకు రానుంది. సాంకేతిక విప్లవాన్ని తెరపైకి తీసుకువస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రాన్ని నిర్మాత శ్రీకాంత్ రెడ్డి కుందూరు నిర్మిస్తుండగా.. రాణి మాడిసన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇక జయవర్ధన్ మాడి క్రియేటివ్ డైరెక్టర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శ్రీ లలితకళా ఫిలిమ్స్, నక్క తోక ఫిల్మ్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. పౌరాణిక ఇతిహాసమైన మహాభారతంలోని శక్తివంతమైన పాత్ర అంబ కథను ఆధారంగా తీసుకుని ఈ చిత్రాన్ని వినూత్నంగా తెరకెక్కిస్తున్నారు. ఆధునిక సాంకేతికతతో పాటు ఏఐ టూల్స్ వినియోగంతో విజువల్స్, పాత్రల రూపకల్పన, కథన నిర్మాణం వంటి అంశాలను కొత్త శైలిలో ఆవిష్కరించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.

# ఏడేళ్ల కల సాకారం కాబోతోంది

## రామాయణ దర్శకుడు నితీశ్ తివారీ



బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, దర్శకుడు నితీశ్ తివారీ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న భారీ చిత్రం 'రామాయణ' సినిమాకు సంబంధించిన ఒక ప్రత్యేక వీడియోను గురువారం చిత్రబృందం విడుదల చేసింది. రాముడి పాత్రలో రణ్‌బీర్ లుక్ ఎలా ఉంటుందనేది ఈ వీడియోతో తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దర్శకుడు నితీశ్ తివారీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్షణం కోసం తాను ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. రామాయణ' కోసం సుమారు ఏడు సంవత్సరాల నుంచి వర్క్ చేస్తున్నా. చిత్రీకరణ ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. కాకపోతే, గత ఏడేళ్లలో ప్రతిక్షణం నాకు గుర్తుకొచ్చింది ప్రేక్షకులు మాత్రమే. ప్రేక్షకుల రియాక్షన్ ఎలా ఉంటుందా? అని ఎదురుచూస్తూ సమయాన్ని గడిపా. ఈరోజు మీ అందరి రియాక్షన్ చూసిన తర్వాత నా ఎదురుచూపులకు తగిన ప్రతిఫలం దక్కిందని నితీశ్ తివారీ అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం ప్రపంచవ్యాప్తంగా 10,000 మంది వర్క్ చేస్తున్నారని టీమ్ ప్రకటించింది.

# క్యూట్ స్టైల్‌తో కుర్రకారుని కట్టిపడేస్తున్న పాయల్ రాజ్ పుత్

పాయల్ రాజ్ పుత్.. తొలి సినిమాతోనే అందం, అభినయంతో పాటు రొమాంటిక్ సీన్స్ లోనూ నటించి మెప్పించింది ఈ అందాల భామ. ముఖ్యంగా కుర్రాళ్ళ గుండెల్లో బాణాలు గుచ్చి డ్రీమ్ గర్ల్ గా మారిపోయింది. కానీ ఆతర్వాత ఈ బ్యూటీ సినిమాల్లో బిజీ అవ్వలేకపోయింది. ఈ హాట్ బ్యూటీ తెలుగులో మొత్తం 12 సినిమాల్లో నటిస్తే కేవలం రెండు మాత్రమే హిట్టయ్యాయి. అయినా కూడా క్రేజ్ మాత్రం విపరీతంగా సొంతం చేసుకుంది. ఆర్‌ఎక్స్ 100 మూవీతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ అందాల భామ. ఆ సినిమాలో అదరగొట్టేసింది. తొలి సినిమాతోనే కుర్రాళ్ల గుండెల్లో స్థానం సంపాదించుకుంది. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన ఈ సినిమా భారీ వసూళ్లు రాబట్టింది. అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసిన ఈ వయ్యారి.. తొలి చిత్రంలో ఓ రేంజ్ రొమాంటిక్ సన్నివేశాల్లో కనిపించింది ఈ వయ్యారి భామ.ఆతర్వాత వరుసగా ఎన్టీఆర్: కథానాయకుడు, =ణశలవ్, వెంకీమామ, డిస్కో రాజా, అనగనగా ఓ అతిథి, తీస్ మార్ ఖాన్, మాయపేటిక, మంగళవారం వంటి చిత్రాల్లో నటించింది. నటనపరంగా ఈ ముద్దుగుమ్మకు మంచి మార్కులు పడ్డా కూడా హిట్స్ మాత్రం రాలేదు. దాంతో మెల్లగా అవకాశాలు తగ్గుతూ వచ్చాయి. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోస్ వైరలవుతున్నాయి. క్యూట్ స్టైల్ తో క్రేజీ ఫోజులిచ్చింది పాయల్. ఈ ఫోటోలకు కుర్రకారు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం లెజెండ్ శరవణన్ తో కలిసి లీడర్ అనే సినిమా చేస్తుంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com